ఆదివారం
4-12-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 162
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

జడ్జీల్ని నియమించుకోనివ్వరా? ధన్కర్

8 లో

సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకం విషయంలో కేంద్రానికి స్వేచ్ఛనివ్వకుండా కొలీజియం నిర్ణయాలు తీసుకోవడంపై యుద్ధమే జరుగుతోంది. ఈ నేపథ్యంలో జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ)ని కొట్టేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆగ్రహంగా ఉన్న ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్కర్ సీజేఐ ముందే తన అసంతృప్తిని బహిరంగంగానే వెళ్లగక్కారు.

బీజేపీకి రెబల్స్ పోటు

- గుజరాత్‌లో రెండో విడత ప్రచారానికి తెర
- రేపు పోలింగ్... ఏర్పాట్లలో ఎన్నికల సంఘం

అహ్మదాబాద్: గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికల రెండో విడత ఎన్నికల ప్రచారం ముగిసింది. అధికార భారతీయ జనతా పార్టీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీజేపీ అభ్యర్థుల తరపున మెగా రోడ్ షోలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ తరపున మల్లికార్జున ఖర్గే, అశోక్ గెహ్లోత్ తదితరులు, ఆప్ తరపున ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం మాన్ తదితరులు ప్రచారం నిర్వహించారు. 27 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ మరోసారి అధికారంలోకి రావటానికి శతవిధాల ప్రయత్నిస్తోంది. ఈ సారైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్, పంజాబ్ మాదిరి విజయం అందుకోవాలని ఆప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓటు బీజేపీకి చమటలు పట్టిస్తోంది, దానితోపాటు తిరుగుబాటు అభ్యర్థుల బెడద కూడా ఎక్కువగా ఉంది. టికెట్ నిరాకరించడంతో చాలామంది బీజేపీ ప్రముఖులు రెబల్స్‌గా పోటీచేశారు. ఇది కమలనాథుల కొంపముంచేలా కనిపిస్తోంది. బీజేపీ అభ్యర్థుల విజయం కోసం ప్రధాని నరేంద్రమోదీ డిసెంబరు 1, 2 తేదీల్లో విస్తృత ప్రచారం చేశారు. బహిరంగ సభలు, రోడ్‌షోలతో ప్రజలను ఆకర్షించడానికి శ్రమించారు. కాంగ్రెస్, ఆప్‌పై విమర్శలు గుప్పించారు. రెండు రోజుల్లో ఏడు ఎన్నికల సభల్లో మోదీ పాల్గొన్నారు. శనివారం తన స్టార్ క్యాంపెయినర్లతో బీజేపీ భారీగా రోడ్డుషోలు, ర్యాలీలు నిర్వహించింది. కేంద్రమంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, గజేంద్రసింగ్ షెకావత్, స్మృతి ఇరానీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా హేమాహేమీలు ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ తరపున ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అనేక ర్యాలీల్లో ప్రసంగించారు. ఆప్ తరపున ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా తదితరులు విస్తృత ప్రచారం చేశారు. దానితో ప్రధాని మోదీ

- మిగతా 2 లో

ఆర్భాటానికే ఆర్బీకేలు!

- ప్రభుత్వ ప్రకటనలకు... ఆచరణకు పొంతన లేని వైనం
- ఒక వంతు కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోళ్లు
- అవి కూడా నామమాత్రంగానే
- చెల్లింపుల్లో తీవ్ర జాప్యం
- ప్రభుత్వ నిబంధనలతో రైతుల అవస్థలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. విత్తనం నాటే దగ్గర నుండి పంట ఇంటికొచ్చేవరకు ప్రకృతి కరుణిస్తే తప్ప నమ్మకం లేని పరిస్థితుల్లో, అధికార యంత్రాంగం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో చేతికొచ్చిన పంటను అమ్ముకోవడానికి రైతులు నానా ఇబ్బందులకు గురికావల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనలకు, ఆచరణకు పొంతన లేకపోవడంతో అన్నదాతల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మాగాణి రైతులు ధాన్యం విక్రయానికి పడుతున్న ఇబ్బందులే ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఖరీఫ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 15.66 లక్షల హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. ఈ సాగు విస్తీర్ణానికి సుమారు 87 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో కనీసం 50 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాల్సి ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు నివేదిక సిద్ధం చేసినప్పటికీ, అంతిమంగా 30 లక్షల టన్నులకు మించి సేకరించలేమనే అంచనాకు వచ్చారు. ఈ ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. క్వింటాకు మద్దతు ధరగా ప్రభుత్వం రూ.2,040 ప్రకటించింది. మిల్లర్లు, దళారుల బారిన పడకుండా ప్రభుత్వమే ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తుందని ముఖ్యమంత్రితో పాటు పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరు నాగేశ్వరరావు రైతులకు భరోసా ఇచ్చారు. ఏ రైతుకూ పంటను తక్కువకు అమ్ముకునే దుస్థితి రాకుండా, తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొంటుందని కూడా ప్రకటించారు. ఆ మేరకు రైతు భరోసా కేంద్రాలను సిద్ధం చేయాలని సీఎం ఆదేశించడంతో పక్షం రోజుల క్రితం ఆర్బీకేల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 5,198 రైతు భరోసా కేంద్రాలుండగా, ఇప్పటివరకు కేవలం 1,510 కేంద్రాల్లో మాత్రమే ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఆ కేంద్రాల్లో కూడా నత్తనడకన సాగుతోంది. మొత్తం 30 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యానికిగాను, ఇప్పటివరకు సుమారు 5 లక్షల టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. అనేక ఆర్బీకేలకు ఇంకా గోనె సంచులు కూడా చేరలేదు. అదేమంటే రొటేషన్‌లో పంపుతున్నామని అధికారులు చెపుతున్నారు. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని మాత్రమే ఆర్బీకేల్లో కొనుగోలు చేస్తున్నారు. ధాన్యంలో 17 శాతం తేమ ఉంటేనే కామన్ రకానికి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. తేమ అంతకంటే ఎక్కువ శాతముంటే నిర్దాక్షిణ్యంగా తిప్పి పంపుతున్నారు. దీంతో రైతులు మళ్లీ ఆ ధాన్యాన్ని ఇంటికి తీసుకెళ్లి ఆరబెట్టి తీసుకొచ్చే పరిస్థితి, అవకాశాల్లేక మిల్లర్లకు, దళారులకు ఏదో ఒక ధరకు తెగనమ్ముకుంటున్నారు. ఆర్బీకేలు తిరస్కరించిన ధాన్యం ఉత్పత్తులకు దళారులు వల వేస్తున్నారు. రైతులు ఇంటికి తిరిగి తీసుకెళ్లడం వ్యయ, ప్రయాసలతో కూడిన వ్యవహారం కావడంతో వ్యాపారులు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ రైతును నిలువుదోపిడీ చేస్తున్నారు. దళారులు సిండికేటై రైతుకు ధర పెంచకుండా జాగ్రత్త పడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఆచరణలో తేమ శాతం 17కి పెరిగితే నిర్ధంద్వంగా తిరస్కరిస్తున్నారు. ఇక ఆర్బీకేల్లో వ్యవసాయ శాఖ సాంకేతిక నిపుణులు తమ దగ్గరకు వచ్చిన ధాన్యం 17 శాతంగా నమోదు చేసి మిల్లులకు పంపిస్తుండగా, అక్కడ మిల్లర్లు మళ్లీ దాని తేమ శాతాన్ని వారి మిషన్ల ద్వారా పరిశీలించి తేమ శాతం అధికంగా ఉన్నట్లు చెపుతూ, ఆ ధాన్యాన్ని తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. రైతులు బ్రతిమిలాడితే క్వింటాకు 5 నుంచి 10 కేజీల వరకు తరుగు కింద తీసేయాలని షరతు విధిస్తున్నారు. అలా అంగీకరిస్తేనే ఆ ధాన్యాన్ని అన్‌లోడ్ చేయనిస్తున్నారు. ఈ ఇబ్బందులన్నీ అధికారులకు చెపుతున్నా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. వాస్తవానికి రైతులు తమ సొంత ఖర్చులతో గోనె సంచులు, హమాలీలు, రవాణా ఏర్పాట్లు చేస్తే ఆ ఖర్చులను మద్దతు ధరతో కలిపి 21 రోజుల్లో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు ఇప్పటివరకు సుమారు వెయ్యి కోట్ల రూపాయల విలువైన ధాన్యం ఆర్బీకేల నుంచి కొనుగోలు చేయగా, రైతుల ఖాతాల్లో రూ.255 కోట్లు జమ చేశారు. అయితే లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీల కింద క్వింటాకు రూ.80 చొప్పున రైతుల నుంచి బహిరంగంగానే వసూలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని, అన్ని ఆర్బీకేలను సిద్ధం చేయాలని రైతులు కోరుతున్నారు. ధాన్యం నిల్వలకు ఇళ్ల వద్ద అవకాశం లేకపోవడంతో ఆకాశంలో మబ్బులు పట్టిన ప్రతిసారీ జాగారం చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. తేమ శాతం నిబంధన తొలగించాలని, తడిసిన ధాన్యం కూడా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం బేషరతుగా కొనుగోలు చేయాలని, వాటికి చెల్లింపులు వెంటనే తమ ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నౌకాదళంలోకి తొలిసారి

మహిళా నావికులు

న్యూఢిల్లీ: మహిళలు శక్తిమంతంగా దూసుకెళుతున్నారు. తొలిసారిగా నావికాదళంలో మహిళలు అడుగుపెట్టనున్నారు. త్రివిధ దళాల్లో నియామకాల కోసం తీసుకొచ్చిన అగ్నిపథ్ పథకం కింద భారత నౌకాదళంలోకి మహిళలను తీసుకున్నట్లు నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్ హరికుమార్ తెలిపారు. డిసెంబరు 4న నౌకాదళ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన ప్రత్యేకంగా మీడియా సమావేశం నిర్వహించారు. 'అగ్నిపథ్ కింద దాదాపు 3000 మంది అగ్నివీరులను నేవీలోకి తీసుకున్నాం. ఇందులో 341 మంది మహిళలు ఉన్నారు. తొలిసారిగా నేవీలో మహిళా నావికులను నియమించాం' అని తెలిపారు. గత ఏడాది కాలంలో నౌకాదళం అనేక కీలక కార్యక్రమాలు చేపట్టిందని అడ్మిరల్ కుమార్ అన్నారు. ఐఎన్ఎస్ విక్రాంత్ విధుల్లో చేరడం చారిత్రక ఘట్టమని కొనియాడారు. పరిశోధనా నౌకల కదలికలపై నిఘా పెట్టామని, ఆ పరిణామాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. "ఆత్మనిర్భర్ భారత్‌పై కేంద్ర ప్రభుత్వం మాకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. 2047 నాటికి భారత నౌకాదళం ఆత్మనిర్భరత సాధిస్తుందని మేం హామీ ఇస్తున్నాం" అని నేవీ చీఫ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఒత్తిడిలో ఉత్పాదక రంగం

- పెరుగుతున్న ఖర్చులు... అధిక రుణ వ్యయాలు
- దేశీయ వినియోగంలో మందగమనం
- ప్రమాద ఘంటికలే అంటున్న ఆర్థిక నిపుణులు



న్యూఢిల్లీ: దేశంలో ఉత్పాదక రంగం ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఇప్పటికే కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాలు, అనాలోచిత నిర్ణయాల ఫలితంగా దేశంలోని అన్ని రంగాలు అధ: పాతాళానికి నెట్టివేయబడ్డాయి. ఉత్పాదక రంగానికి చేయూత ఇచ్చే దిశగా కేంద్ర పాలకుల చర్యలు లేకపోవడంతో ఆ రంగం వరుస సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటూనే ఉంది. దీనికితోడు అంతర్జాతీయ విపత్కర పరిణామాలు తోడయ్యాయి. తాజాగా పెరుగుతున్న ధరలు... అధిక రుణ వ్యయాలు దేశంలోని ఉత్పాదక రంగం వృద్ధిని అయోమయంలోకి నెట్టివేశాయి. రెండవ త్రైమాసికంలో వృద్ధి మందగించిన తరువాత భారత తయారీ రంగంలో సంకోచం ఆసియాకు చెందిన మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో ఒత్తిడిని సూచిస్తుందని ఆర్థిక వేత్తలు హెచ్చరిస్తున్నారు. భారతదేశ స్థూల దేశీయోత్పత్తి జులై-సెప్టెంబర్ కాలంలో 6.3 శాతం వద్ద వృద్ధి చెందింది. అంతకుముందు త్రైమాసికంలో 13.5 శాతం కంటే సగం తక్కువ. కానీ ఇది భారతదేశ జీడీపీ దాదాపు 16 శాతం తోడ్పడే తయారీ రంగంలో తీవ్ర పతనం, ఇది ప్రమాద ఘంటికలు పెంచింది. మేము ఒత్తిడి సంకేతాలను చూస్తున్నామని, పెరిగిన వ్యయాలు, తక్కువ ఎగుమతుల కారణంగా కార్పొరేట్ లాభదాయకతపై ఒత్తిడి ఉత్పత్తిపై భారం పడిందని, దేశీయ వినియోగంలో మందగమనం మరొక ఆందోళన

- మిగతా 2 లో

శ్రీకాళహస్తి ఎమ్మెల్యేకు ఇంటి పోరు

2 లో

నేడు విజయవాడకు రాష్ట్రపతి

- రాష్ట్ర ప్రభుత్వం అధ్వర్యంలో పౌర సన్మానం
- రాజ్‌భవన్‌లో అధికారిక విందు
- సాయంత్రం విశాఖ నేవీ డే వేడుకలకు హాజరు
- రేపు తిరుపతిలో పర్యటన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ద్రౌపది ముర్ము రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారి ఏపీలో రెండు రోజుల పర్యటన కోసం ఆదివారం విజయవాడ వస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి రాష్ట్ర ప్రభుత్వం పౌర సన్మానం ఏర్పాటు చేసింది. ఇందుకోసం స్వాగత ఏర్పాట్లు చేపడుతోంది. సన్మానం అనంతరం రాష్ట్రపతి గౌరవార్థం రాజ్‌భవన్‌లో గవర్నర్ విశ్వభూషణ్ హరి చందన్ అధికారిక విందు ఏర్పాటుచేశారు. ఆదివారం ఉదయం గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటున్న రాష్ట్రపతికి సీఎం జగన్, గవర్నర్ స్వాగతం పలుకుతారు. ఉదయం 11.25-12.15 గంటల మధ్య పోరంకి మురళీ కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్రపతికి పౌర సన్మానం జరుగుతుంది. అనంతరం రాజ్‌భవన్‌లో అధికారిక విందులో పాల్గొంటారు. ఈ కార్యక్ర మంలో సీఎం జగన్‌తో పాటు హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు పాల్గొంటారు. మధ్యాహ్నం 2.35 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని నేవీ డే వేడుకల్లో పాల్గొనేందుకు విశాఖ వెళతారు. ముఖ్యమంత్రి ఇక్కడే ఆగిపోతుండటంతో విశాఖలో రాష్ట్ర మంత్రి అమర్నాథ్ రాష్ట్రపతి కార్యక్రమాల్లో ప్రభుత్వ ప్రతినిధిగా పాల్గొంటారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రి అమర్నాథ్ హోదా పెంచుతూ మినిస్టర్ ఇన్ వెయిటింగ్‌గా ఖరారు చేసింది. తొలిసారి మంత్రి అయిన అమర్నాథ్‌కు ఇది అరుదైన అవకాశంగా మారనుంది. విశాఖలో కార్యక్రమాలు పూర్తి చేసుకున్న తరువాత ఆదివారం రాత్రి 9.25 గంటలకు రాష్ట్రపతి తిరుపతి చేరుకుంటారు. నేరుగా తిరుమల

- మిగతా 2 లో

ఇదీ లోకం!

శెభాష్..! వెళ్లేటప్పుడు ఇది పట్టికెళ్లడం మరచిపోకండే!

నౌకా విన్యాసాలకు సర్వం సిద్ధం

- రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభం
- వైస్ అడ్మిరల్ విశ్వజిత్ దాస్‌గుప్తా వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ సాగర తీరంలోని ఆర్కే బీచ్ వద్ద ఆదివారం నేవీ డే సందర్భంగా నౌకా విన్యాసాలకు సర్వం సిద్ధం చేసినట్లు వైస్ అడ్మిరల్ విశ్వజిత్ దాస్‌గుప్తా తెలిపారు. యేటా మాదిరిగానే డిసెంబర్ 4న విశాఖ సాగరతీరంలో నావికాదళ విన్యాసాలు జరగనున్నాయన్నారు. ఈ విన్యాసాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభిస్తారని చెప్పారు. రాష్ట్రపతి, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ సహా అనేకమంది ప్రముఖులు ప్రత్యక్షంగా వీక్షిస్తారని చెప్పారు. దేశ భద్రతలో నావికాదళం ప్రధాన భూమిక పోషిస్తున్నదని, అండర్ వాటర్ డొమైన్‌లో తూర్పు నావికాదళం

- మిగతా 2 లో

ఢిల్లీ అల్లర్ల కేసులో

ఉమర్ ఖాలిద్ నిర్దోషి

- ఢిల్లీ కర్కర్దూమా కోర్టు తీర్పు

న్యూఢిల్లీ: రెండేళ్ల క్రితం జరిగిన ఢిల్లీ అల్లర్లకు సంబంధించిన కేసులో జేఎన్‌యూ విద్యార్థి నాయకుడు ఉమర్ ఖాలిద్‌తో పాటు యునైటెడ్ ఎగైనెస్ట్ హేట్ (యూఏహెచ్) సభ్యుడు ఖాలిద్ సైఫీని నిర్దోషులుగా కోర్టు ప్రకటించింది. ఈ మేరకు ఢిల్లీలోని కర్కర్దూమా కోర్టు అదనపు సెషన్స్ జడ్జి పులస్త్య ప్రమచల శనివారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు. 2020 ఫిబ్రవరి నాటి

- మిగతా 2 లో

శ్రీశైలంపై ఏకాభిప్రాయం

హైదరాబాద్: ఎట్టకేలకు శ్రీశైలం జలాశయంపై రెండు తెలుగు రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. జలాశయం రూల్ కర్వ్‌లో మార్పులు చేసేందుకు ఏపీ, తెలంగాణ సుముఖత వ్యక్తం చేశాయి. హైదరాబాద్‌లోని జలసౌధలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు రిజర్వాయర్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఆర్ఎంసీ) కన్వీనర్ ఆర్కే పిళ్లయి అధ్యక్షతన జరిగిన సమావేశానికి కేఆర్ఎంబీ సభ్యుడు మౌంతాగ్, తెలంగాణ నీటి పారుదల శాఖ ఈఎన్సీ మురళీధర్, జెన్‌కో డైరెక్టర్ వెంకట రాజాం, ఏపీ

- మిగతా 2 లో

అంతర్జాతీయ ఉమ్మడి ప్రయోజనాలే లక్ష్యం

యూరోపియన్ కౌన్సిల్

బీజింగ్: యూరోపియన్ యూనియన్ సభ్య దేశాల తరపున చైనాతో సంబంధాల అభివృద్ధికి తాము కట్టుబడి ఉంటామని యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు చార్లెస్ మిచెల్ పేర్కొన్నారు. చైనా పర్యటనలో ఉన్న మిచెల్ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో బీజింగ్‌లో చర్చలు జరిపారు. ప్రపంచ శాంతికి చైనా, ఈయూ రెండు ప్రధాన శక్తులుగా ఉమ్మడి అభివృద్ధికి, మానవ పురోగతికి రెండు ప్రధాన నాగరికతలు అని మిచెల్ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ ఉమ్మడి ప్రయోజనాల కోసం, పరస్పర ప్రయోజనాలకోసం చైనా-ఈయూ సంబందాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ జియాంగ్ జెమిన్ గురించి ప్రస్తావించారు. చైనా-ఈయూ సంబంధాలను ఏకీకృతం చేయడం, అభివృద్ధి చేయడం కొనసాగిస్తామని చైనా ఈయూతో తన సంబంధాలను వ్యూహాత్మకంగా అభివృద్ధి చేస్తుందని, మరింత బలోపేతం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని జిన్‌పింగ్ పేర్కొన్నారు. చైనా ఆధునీకరణను ఐదు లక్షణాలపై వివరించారు. ప్రస్తుతం ప్రపంచం, కాలం, చరిత్రలో వేగవంతమైన మార్పుల మధ్య, అన్ని దేశాలు ముందుకు వెళ్లే రహదారి గురించి ఆలోచిస్తున్నాయని ఆయన నొక్కి చెప్పారు. చైనా లక్షణాలతో కూడిన సోషలిజం మార్గాన్ని అనుసరిస్తామని, లోతైన సంస్కరణలకు కట్టుబడి ఉంటామన్నారు. శాంతి స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరించడంలో దృఢంగా ఉంటామని ప్రపంచ శాంతిని సమర్థించడం, ఉమ్మడి అభివృద్ధిని ప్రోత్సహించడం వంటి విదేశాంగ విధాన లక్ష్యాలను కొనసాగిస్తామని భాగస్వామ్య భవిష్యత్తుతో మానవ సమాజ నిర్మాణాన్ని ప్రోత్సహించడానికి కట్టుబడి ఉంటామని జిన్‌పింగ్ పేర్కొన్నారు.

క్యూబా ఒంటరి కాదు: కేకేఈ ఎంపీ

హవానా: యూరోపియన్ పార్లమెంట్ గ్రూప్, పిటిషన్లపై కమిటీ మధ్య జరిగిన సమావేశంలో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ గ్రీస్ (కేకేఈ) క్యూబాకు మద్దతు పలికింది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా క్యూబా ప్రజల పోరాటానికి కేకేఈ సంఘీభావాన్ని ప్రకటించింది. ఈయూ క్యూబాపై విడుదల చేసిన అబద్ధాలు, అపనిందలను "మానవ హక్కుల ఉల్లంఘన"కు సంబంధించినదిగా క్యూబాలో సామాజిక ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండించారు. క్యూబాకు వ్యతిరేకంగా జరిగిన ఈ దాడులు ఉద్దేశపూర్వకంగా జరిగినవిగా పేర్కొన్నారు. క్యూబాపై అమెరికా సామ్రాజ్యవాదులు విధించిన దిగ్బంధనాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా తక్షణమే ఎత్తివేయాలని, క్యూబాపై సంఘీభావాన్ని బలోపేతం చేయడం అవసరం అని కేకేఈ ఎంపీ నికోలా-అలవానోస్ పిలుపునిచ్చాచ్చారు. క్యూబాపై సామ్రాజ్యవాద దేశాలు విధించిన ఆర్థిక, వాణిజ్య దిగ్బంధనాన్ని క్యూబా ప్రజలను అవమానించడాన్ని తీవ్రంగా ప్రతిఘటించారు. ప్రకృతి వైపరీత్యాలు, తుఫానులు, ప్రమాదాలకు క్యూబా చేపట్టిన ప్రపంచవ్యాప్త ప్రాథమిక సేవలు ఆటంకం కలిగంచడం, వస్తువులు, ఆహారం, ఔషధాలను ప్రపంచ దేశాలకు అందకుండా సామ్రాజ్యవాద కుట్రల ద్వారా క్యూబా ఆర్థికాభివృద్ధికి ఆటంకం కలిగించడం తగదని నికోలా హెచ్చరించారు.

ఇంధన ధరల పెరుగుదలపై బ్రిటన్‌లో నిరసనలు

లండన్: బ్రిటన్‌లో ఇంధన ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా వేలాది మంది భారీ ప్రదర్శన చేపట్టారు. బ్రిటన్ ప్రభుత్వం గత నెలలో ప్రపంచంలోనే అత్యధిక ఇంధన బిల్లులను ప్రజలపై విధించడం దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీసింది. దేశంలోని 40కంటే ఎక్కువ పట్టణాలు, నగరాల్లో నిరసనకారులు గ్యాస్, పెరిగిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా గళమెత్తారు. గ్యాస్ ధరలు పెరగడంలో శీతాకాలం వెచ్చదనం కోసం విద్యుత్తు వినియోగం ఎక్కువకావడంతో తద్వారా మోయలేని బిల్లుల చెల్లింపులు ప్రభుత్వ వైఫల్యంగా పేర్కొన్నారు. విద్యుత్తు ఛార్జీలను చెల్లించలేని కారణంగా తమ మీటర్లను తామే స్వయంగా డిస్‌కనెక్ట్ చేసినట్లుగా నిరసనకారులు పేర్కొన్నారు. దీనితో పిల్లలు,వృద్ధులు, వికలాంగులు తీవ్రమైన చలికి (6.9 మిలియన్ల ప్రజలు) తీవ్రంగా వణుకుతున్నట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. ఇంధన సంస్థలు రికార్డు స్థాయిలో లాభాలు ఆర్జిస్తున్నప్పుడు లక్షలాది కుటుంబాలు తమ విద్యుత్తు బిల్లులను చెల్లించలేని దుర్భర స్థితిలో ఉండటం దారుణమని పేరెంట్స్ ఫర్ ఫ్యూచర్ ఆర్గనైజర్ జెల్లీ వ్యాఖ్యానించారు.

ఉదాసీనతకు చోటివ్వకండి: ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ: 'పట్టణ ఉదాసీనత'కు చోటివ్వకుండా ప్రతి ఒక్కరు తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం కోరింది. గుజరాత్ తొలివిడత పోలింగ్‌లో నిరాశాజనకమైన ఓటింగ్ శాతం నమోదైన నేపథ్యంలో ఓటర్లకు ఎన్నికల సంఘం ప్రత్యేక విజ్ఞప్తి చేసింది. డిసెంబరు 1న జరిగిన తొలివిడత ఎన్నికల్లో 63.3 శాతం ఓటింగ్ నమోదైంది. సూరత్, రాజ్‌కోట్, జామ్‌నగర్ పట్టణాల్లో సరాసరి కంటే ఇంకా తక్కువ పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు చెబుతున్నారు. మరోవైపు మరోవైపు 2017 అసెంబ్లీ ఎన్నికల తొలివిడతలో పోలైన 66.75 శాతం ఓటింగ్ శాతం కన్నా ఈసారి ఇంకా తగ్గిందని ఈసీ వెల్లడించింది. అయితే, తొలివిడత పోలింగ్‌లో కొన్ని నియోజకవర్గాల్లో గతంతో పోల్చుకుంటే ఓటింగ్ శాతం పెరిగినప్పటికీ.. పట్టణ ప్రాంతాల్లో ఓటు హక్కు వినియోగించుకునే వారి సంఖ్య బాగా తగ్గిందని దాని ప్రభావం సరాసరి పోలింగ్ శాతంపై పడిందని అధికారులు చెబుతున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. రాష్ట్రంలో సరాసరి ఓటింగ్ 75.6 శాతం కాగా.. సిమ్లాలో మాత్రం అత్యల్పంగా 62.53 శాతం ఓటింగ్ నమోదైంది. దీనిని బట్టి పట్టణ ప్రాంతాల ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆసక్తి చూపడం లేదని స్పష్టమవుతోంది.

నేడు విజయవాడకు రాష్ట్రపతి

(మొదటిపేజీ తరువాయి)

చేరుకొని అక్కడే బస చేస్తారు. 5వ తేదీ ఉదయం 9.25 గంటలకు వరాహస్వామి, తిరుమల వెంకన్న దర్శనం చేసుకుంటారు. అక్కడ నుంచి పద్మావతి అతిథిగృహం చేరుకుంటారు. 10.50 గంటలకు తిరుమల నుండి బయలుదేరి 11.35 గంటలకు అలిపిరి గోమందిరానికి, 11.55 గంటలకు శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయాన్ని రాష్ట్రపతి సందర్శిస్తారు. మధ్నాహ్నం 1.00 గంటకు శ్రీపద్మావతి అమ్మవారి దర్శనం చేసుకుంటారు. అక్కడి నుంచి నేరుగా 1.40 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని తిరిగి దిల్లీ వెళతారు.

ఒత్తిడిలో ఉత్పాదక రంగం

(మొదటిపేజీ తరువాయి)

కలిగిస్తోందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. 'కొన్ని వెనుకబడి ఉన్నాయని, ముఖ్యంగా ఫ్యాక్టరీ కార్యకలాపాలు నిరాశపరిచాయని, ప్రపంచంతో సమానంగా తయారీ కార్యకలాపాలను తీసుకురావడానికి భారతదేశం మరింత కష్టపడాలి' అని అన్నారు. వినియోగం ఆందోళనకరంగా 'కె' ఆకారంలో ఉందని, గ్రామీణ వేతన వృద్ధి ఇప్పుడు నిలిచిపోయిందని, వినియోగదారుల ఆశావాదం కోవిడ్ మహమ్మారి మునుపటి స్థాయిల కంటే తక్కువగా ఉందని నోమురా ఆర్థిక వేత్తలు పేర్కొన్నారు. 'అంటే విస్తృత-ఆధారిత మందగమనం జరుగుతోంది' అని వివరించారు. కాగా 2023లో 4.7 శాతం, మార్చి 2024తో ముగిసే ఆర్థిక సంవత్సరానికి 5.2 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నారు. ఆ గణాంకాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అంచనా వేయబడిన దాదాపు 7 శాతం వృద్ధి రేటు కంటే చాలా తక్కువగా ఉన్నాయి.

నౌకా విన్యాసాలకు సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

వ్యూహాత్మక విధానం అవలంబిస్తున్నదని విశ్వజిత్ దాస్‌గుప్తా అన్నారు. జలాంతర్గాముల సేవలే కాకుండా మానవ రహిత పరికరాలపైనా దృష్టి సారించామని స్పష్టం చేశారు. విశాఖలో జలస్వా షిప్‌లో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో ఫ్లీట్ సపోర్ట్ నౌకల తయారీకి సంబంధించి కాంట్రాక్టు వేగంగా సాగుతోందన్నారు. అనుమతులకు సంబంధించి దిల్లీ స్థాయిలో తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. దక్షిణ శ్రీలంకలో చైనా ఓడరేవు ఏర్పాటుపై సమీక్షిస్తున్నామని, ఆ దేశం అనేక దేశాల్లో పెద్దఎత్తున మౌలిక వసతులు ఏర్పాటు చేసుకుంటోందని, శ్రీలంకలోనూ అదే రీతిలో బేస్ ఏర్పాటు చేసుకుందని ఆయన గుర్తు చేశారు. దేశానికి ఎలాంటి ముప్పు ఏర్పడినా దీటుగా తిప్పికొట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అణు జలాంతర్గామి అరిహంత్ ఇప్పటికే సేవలకు సిద్ధంగా ఉందని విశ్వజిత్ దాస్‌గుప్తా చెప్పారు. భవిష్యత్తులో మరో అణు జలాంతర్గామిని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. 'ఆత్మనిర్భర్ భారత్'లో భాగంగా ప్రభుత్వ షిప్‌యార్డుల్లో 38 నౌకలు తయారీలో ఉన్నాయన్నారు. అగ్నిపథ్ మొదటి బ్యాచ్‌లో 3474 మంది ఎంపికకు పిలిచామని, వారిలో 340మంది మహిళలు ఉన్నారన్నారు. శిక్షణ తర్వాత తుది జాబితా ప్రకటిస్తామని, 2023 మార్చి నాటికి అభ్యర్థులంతా విధుల్లో చేరతారన్నారు. రాష్ట్రపతి రాక సందర్భంగా నగరంలో భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా బీచ్‌లో పోలీసు బందోబస్తు పెంచారు. ఆదివారం సెలవు కావడం, నేవీ డే విన్యాసాలు జరగడంతో లక్షలాదిమంది ప్రజలు విన్యాసాలు తిలకించేందుకు బీచ్ రోడ్డుకు వచ్చే అవకాశం ఉండడంతో అడుగడుగునా పోలీసులు ట్రాఫిక్ కాంక్షలు విధించారు. బందోబస్తు కోసం చుట్టుపక్కల జిల్లాల నుంచి పోలీసులు నాలుగు రోజుల క్రితమే ఇక్కడికి వచ్చారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, డీసీపీలు, ఏసీపీలు భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

దిల్లీ అల్లర్ల కేసులో ఉమర్ ఖాలిద్ నిర్దోషి

(మొదటిపేజీ తరువాయి)

అల్లర్లలో 53 మంది చనిపోగా.. 700 మందికి పైగా గాయపడ్డారు. ఉమర్ ఖాలిద్, ఖాలిద్ సైఫీపై 2020 ఫిబ్రవరిలో ఖజూరీ ఖాస్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సెప్టెంబర్ 13న ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేయగా.. అప్పటి నుంచి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. కాగా, అక్టోబర్ 18న ఈశాన్య దిల్లీ అల్లర్లకు సంబంధించిన కుట్ర కేసులో ఉమర్ ఖలీద్‌కు దిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించింది. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్‌సీ)కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా హింస చెలరేగింది. ఈ నేపథ్యంలో ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్, జేఎన్‌యూ విద్యార్థులు నటాషా నర్వాల్, దేవాంగనా కలిత, జామియా సమన్వయ కమిటీ సభ్యులు సఫూరా జర్గర్, ఆప్ మాజీ కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్‌తో పాటు మరికొంతమందిపై ఉగ్రవాద నిరోధక చట్టం చట్టవిరుద్ధమైన కార్యకలాపాల (నివారణ) చట్టం (ఉపా) కింద కేసులు నమోదయ్యాయి.

శ్రీకాళహస్తి ఎమ్మెల్యేకు ఇంటి పోరు

బావమరిది ఆత్మహత్యాయత్నం

- చేయి, కడుపు భాగంపై కత్తితో గాయాలు
- బావ మధు వేధిస్తున్నాడని ఆరోపణ
- రెండు కుటుంబాల మధ్య ఆస్తి వివాదాలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డిని ఇంటిపోరు వేధిస్తోంది. సతీమణి శ్రీవాణి సోదరుడు సామాను శ్రీధర్ రెడ్డి (ఎస్ఎస్ఆర్) ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన జిల్లాలో సంచలనం కలిగించింది. శ్రీధర్ రెడ్డి శుక్రవారం రాత్రి, శనివారం పగలు రెండుసార్లు కత్తితో విపరీతంగా కోసుకున్నారు. ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి వేధింపుల వల్లే తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు శ్రీధర్ రెడ్డి ఆరోపిస్తున్నారు. తనపై వేధింపులు మానకపోతే భార్యాపిల్లలతో కలసి శ్రీకాళహస్తి పట్టణం నడిబొడ్డున పెళ్లి మండపం వద్ద ఆత్మహత్య చేసుకుంటామని ఎస్ఎస్ఆర్ పోలీసుల ముందే హెచ్చరించారు. దీంతో శ్రీధర్ రెడ్డి ఇంటి వద్ద ప్రస్తుతం భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్ఎస్ఆర్ కత్తితో కోసుకోవడం చూసి ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి బాధితుడి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి, సామాను శ్రీధర్ రెడ్డికి మధ్య ఆస్తి వివాదాలు నడుస్తున్నాయి. ఆస్తిలో తనకు వాటా కావాలని బియ్యపు మధు, ఆయన సతీమణి శ్రీవాణి గత కొంతకాలంగా శ్రీధర్ రెడ్డిని విపరీతంగా వేధిస్తున్నారు. దీంతో రెండు కుటుంబాల మధ్య అంతరం పెరిగింది. ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇటీవల వివాదం మరింత పెరిగింది. శ్రీధర్ రెడ్డికి చెందిన ఆస్తులు ఏవీ విక్రయించకుండా... వాటిని రిజిస్ట్రేషన్ కానివ్వకుండా ఎమ్మెల్యే, ఆయన కుటుంబ సభ్యులు అభ్యంతరాలు లేవదీస్తున్నారు. ఈ కారణంగా శ్రీధర్ రెడ్డి వ్యాపారాలు బాగా దెబ్బతిన్నాయి. దీనికితోడు శ్రీధర్ రెడ్డి ముఖ్య అనుచరులపై అక్రమ కేసులు బనాయించడం, నిత్యం మానసికంగా వేధింపులకు గురి చేయడంతో ఆయన తీవ్ర మనోవేదనకు గురైనట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఎమ్మెల్యే సతీమణి తాము అనుకుంటే రౌడీలను పెట్టి దాడులు చేయిస్తామని కూడా బెదిరించారని అంటున్నారు. కాగా శ్రీధర్ రెడ్డి పెంపుడు శునకం ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. రెండు రోజుల కిందట ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి కుటుంబ సభ్యులు వారు నివాసం ఉండే ఇంటి సమీపంలో బోరు వేయిస్తుండగా శ్రీధర్ రెడ్డి అభ్యంతరం చెప్పారు. ఇక్కడ బోరు వేయడం వలన తన ఇంటికి వచ్చే వాహనాలకు ఇబ్బంది అవుతుందన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డికి ఆయన సోదరి శ్రీవాణి మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే శ్రీధర్ రెడ్డి అభ్యంతరం లెక్క చేయకుండా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు అక్కడే బోరు వేయించేందుకు ప్రయత్నిస్తున్నారని, తన ఇంటికి దారి లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే ఇలా చేశారని తీవ్ర ఆవేదన చెందారు. అదీకాకుండా ఎమ్మెల్యే సతీమణి తన సోదరుడు శ్రీధర్ రెడ్డి ఉంటున్న నివాసంలో కూడా తమకు వాటా ఉందని అనడంతో ఆవేదనతో శ్రీధర్ రెడ్డి శుక్రవారం రాత్రి కత్తి తీసుకుని తన చేతిని విపరీతంగా కోసేసుకున్నారు. కడుపు భాగంలో కూడా కత్తితో అనేక చోట్ల గాట్లు పెట్టుకున్నారు. తన ఇంటిలో నుంచి వెళ్లకపోతే భార్యాపిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకుంటా నని సోదరి శ్రీవాణిని హెచ్చరించారు. తాను ఉంటున్న ఇంటిలో ఎమ్మెల్యే కుమారుడు, కుమార్తెకు వాటా ఉందని అడగడం బాధాకరమని అన్నారు. శ్రీధర్ రెడ్డి ఆత్మహత్యకు ప్రయత్నించిన విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. వైద్యం కోసం ఆస్పత్రికి రావాలని ఆయనను కోరారు. అందుకు శ్రీధర్ రెడ్డి అంగీకరించకపోవడంతో వైద్యుడిని అక్కడికే పిలిపించారు. వైద్యుడు శ్రీధర్ రెడ్డికి చేతికి కుట్లు వేసి వైద్యం అందించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా ఎస్ఎస్ఆర్ ఇంటి వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు ఉండగానే శ్రీధర్ రెడ్డి శనివారం పగలు మళ్లీ కత్తితో చేయి కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించారు. రెండవసారి ఆయన ఆత్మహత్యకు యత్నించడం సంచలనం కలిగించింది. ఇది రెండు ప్రముఖ కుటుంబాల మధ్య సమస్య కావడంతో ఏం చేయాలో తెలియక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు.

నేను విఫల నేతను

హైదరాబాద్: ఓడిపోయానని చెప్పుకోవడానికి ఏ మాత్రం మొహమాటపడనని, తాను పరాజయం పొందిన రాజకీయ నాయకుడినని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్ ఆఫ్ ఇండియా సదస్సులో పవన్ పాల్గొన్నారు. 'ఫేసింగ్ ది ఫ్యూచర్' అంశంపై సీఏ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. "నా పరాజయాల గురించి నిర్భయంగా మాట్లాడుతా. పరాజయంలోనే జయం ఉంటుంది. డబ్బున్న వాళ్లంతా గొప్పోళ్లు, పేరున్న వాళ్లంతా మహానుభావులు అనుకోవద్దు. ప్రతి ఒక్కరినీ గుడ్డిగా నమ్మొద్దు. దేవుడిని కూడా గుడ్డిగా నమ్మొద్దు. ఏది తప్పు.. ఏది ఒప్పు అనేది నిర్ణయించుకోవాలి. మన వ్యక్తిగత విజయమే దేశానికి పెట్టుబడి" అని పవన్ కల్యాణ్ అన్నారు.

ఫిర్యాదు కాపీ ఇవ్వండి

సీబీఐకి కవిత లేఖ

విశాలాంధ్ర-హైదరాబాద్: మద్యం కేసుకు సంబంధించి సీబీఐ ఇచ్చిన నోటీసులకు టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రతిస్పందించారు. స్పష్టత కోసం ఆమె వద్దకు రావాలని అనుకుంటు న్నామని శుక్రవారం కవితకు సీఆర్పీసీ సెక్షన్ 160 నోటీసు ద్వారా సీబీఐ సమాచారం ఇచ్చింది. దానికి కవిత స్పందిస్తూ శనివారం సీబీఐ అధికారి అలోక్ కుమార్ షాహికి లేఖ రాశారు. సీబీఐకి కేంద్ర హోం శాఖ చేసిన ఫిర్యాదు కాపీతో పాటు దాని ఆధారంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీని తనకు అందించాలని కోరారు. సాధ్యమైనంత త్వరగా సంబంధిత కాపీలను అందించాలని పేర్కొన్నారు.

విద్యార్థినిపై ప్రొఫెసర్ అత్యాచారయత్నం

హెచ్‌సీయూలో ఉద్రిక్తం

విశాలాంధ్ర-హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ)లో దారుణం చోటుచేసుకుంది. థాయిలాండ్‌కు చెందిన విద్యార్థినిపై వర్సిటీ ప్రొఫెసర్ అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. ఆ సమయంలో విద్యార్థిని తృటిలో తప్పించుకుని పారిపోయింది. ఈ మేరకు బాధితురాలు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రొఫెసర్‌పై పోలీసులు సెక్షన్ 354 కింద కేసు నమోదు చేశారు. హెచ్‌సీయూ ప్రొఫెసర్‌ని సస్పెండ్ చేసింది. బాధితురాలి వాంగ్మూలం నమోదు చేశాక మరిన్ని సెక్షన్లు నమోదు చేయనున్నట్లు గచ్చిబౌలి పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ప్రొఫెసర్ పోలీసుల అదుపులో ఉన్నారు. వర్సిటీలో జరిగిన ఘటనపై విద్యార్థులు భగ్గుమన్నారు. దుశ్చర్యకు పాల్పడిన ప్రొఫెసర్‌పై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. యూనివర్సిటీ గేటు ఎదుట ప్రొఫెసర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రొఫెసర్‌ను విధుల నుంచి తొలగించాలని ఏబీవీపీ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. దీంతో హెచ్‌సీయూలో పోలీసులు అదనపు బలగాలను మోహరించారు. బాధ్యతాయుతంగా ప్రవర్తించాల్సిన ఆచార్యులే దారుణాలకు పాల్పడితే ఇంకెవరికి చెప్పాలంటూ పలువురు విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేశారు. హెచ్‌సీయూ యాజమాన్యం స్పందించి ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకునేంత వరకు ఆందోళన విరమించేది లేదని విద్యార్థులు తేల్చి చెప్పారు.

'శ్రీశైలం'పై ఏకాభిప్రాయం

(మొదటిపేజీ తరువాయి)

జలవనరులశాఖ ఈఎన్సీ నారాయణరెడ్డి హాజరయ్యారు. అయితే నాగార్జున సాగర్ ప్రాజెక్టు రూల్ కర్వ్స్ విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడంతో కేంద్ర జలసంఘం సూచనల ప్రకారం నిర్ణయం తీసుకుంటామని రవికుమార్ పిళ్లయి వెల్లడించారు. జల విద్యుత్ చెరి సగం వినియోగానికి రెండు రాష్ట్రాలు ఆమోదించాయని చెప్పారు. మిగులు జలాల విషయంలో సమావేశంలో స్పష్టత వచ్చిందనీ, ప్రాజెక్టులు పూర్తిగా నిండి ఓవర్‌ఫ్లో అయ్యాకే వరదను మిగులు జలాల కింద పరిగణించాని ఏపీ, తెలంగాణ సూచించాయని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లోకి కృష్ణానది ప్రవేశించాక.. సరిహద్దు నుంచి ప్రతి నీటి చుక్కా లెక్కించాలన్న నిర్ణయానికి రెండు రాష్ట్రాలు ఆమోదం తెలిపినట్లు రవి కుమార్ పిళ్లయి చెప్పారు. రెండు రాష్ట్రాల అంగీకారంతో నివేదికను ఖరారు చేస్తామన్నారు.

సాగర్ విషయంలో సీడబ్ల్యూసీ నిర్ణయం: ఏపీ ఈఎన్‌సీ

శ్రీశైలం జలాశయం విషయంలో రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదిరిందని ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి తెలిపారు. శ్రీశైలం రూల్‌కర్వ్స్, నీటిమట్టం, విద్యుదుత్పత్తిపై ఏకాభిప్రాయం కుదిరిందన్నారు. నాగార్జున సాగర్ విషయంలో మాత్రం ఏకాభిప్రాయం కుదరలేదని.. దీనిపై సీడబ్ల్యూసీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. సముద్రంలో వృథాగా కలిసే నీటిని లెక్కించాలే తప్ప.. ఆ నీటిని రాష్ట్రాల వాటాలో కలపకూడదని కమిటీ నిర్ణయించిందని తెలిపారు.

ఆత్మస్థైర్యంతో లక్ష్యాలు సాధించాలి

తెలంగాణ సీఎం కేసీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రపంచంలో సంపూర్ణ మానవుడు అంటూ ఎవరూ లేరని, సమస్యలను అధిగమిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడం ద్వారానే జీవితానికి పరిపూర్ణత చేకూరుతుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శనివారం వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మన్యూనతకు లోనవకుండా, ఆత్మస్థైర్యంతో లక్ష్యాలను సాధించాలని సీఎం పిలుపునిచ్చారు. ఆసరా అవసరమైన దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తున్నదనీ, దివ్యాంగుల సంక్షేమంలో తెలంగాణను అత్యుత్తమ రాష్ట్రంగా గుర్తించి కేంద్రం అవార్డులు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధను కనబరిచే ఉద్దేశంతో మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి దివ్యాంగుల శాఖను ప్రత్యేక శాఖగా స్వతంత్ర విభాగంగా ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో దివ్యాంగులకు రూ.500 పెన్షన్‌తో సరిపడితే, స్వరాష్ట్రంలో ఒక కుటుంబంలో ఎంతమంది దివ్యాంగులు ఉంటే అంతమందికి రూ.3,016 పింఛన్ అందిస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని కలిగిస్తున్నామని చెప్పారు. దివ్యాంగులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితబంధు పథకాలతోపాటు ఇతర పథకాల్లో 5 శాతం రిజర్వేషన్, ఉద్యోగ నియామకాలలో 4 శాతం రిజర్వేషన్‌ను అమలుచేస్తున్నామని వివరించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న దివ్యాంగుల కోసం ఉచిత కోచింగ్‌తోపాటు మెటీరియల్, ఉద్యోగ సర్వీసుల్లో ప్రత్యేక అలవెన్సులు, ఎకనామిక్ రిహాబిలిటేషన్ సెంటర్లు, దివ్యాంగుల సలహా మండలి, ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వెల్లడించారు. వీల్‌చైర్లు, త్రీ వీలర్ స్కూటీలు, చేతికర్రలు మొదలైనవి సమకూరుస్తూ రోజువారి జీవితంలో వారు ఎదుర్కొనే ప్రతిబంధకాలను తొలగించే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. దివ్యాంగులకు ప్రత్యేక విద్యను అందించేందుకు ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు ఏర్పాటు చేయడంతోపాటు ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను అందిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నామని కేసీఆర్ అన్నారు. రాబోయే కాలంలో దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యంగా మరెన్నో కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగులను మనలో ఒకరుగా ఆదరించాలని కోరారు.

ఉన్నతమైంది వైద్య వృత్తి: కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్: వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైందని మంత్రి కేటీఆర్ అన్నారు. గచ్చిబౌలి ఏఐజీ హాస్పిటల్‌లో శనివారం జరిగిన ఉమెన్ ఇన్ మెడిసిన్ కాంక్లేవ్‌కు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంట్లో వారి పిల్లల్లో ఒకరైనా డాక్టర్ కావాలని కోరుకుంటారు... అలానే నేనూ డాక్టర్ అవ్వాలని మా అమ్మ కోరుకుందని మంత్రి చెప్పారు. వైద్యులు కుటుంబ జీవితాన్ని త్యాగం చేస్తారన్నారు. ఎప్పుడు ఏ ఎమర్జెన్సీ ఉన్నా అటెండ్ అవుతారని తెలిపారు. వైద్య రంగంలో మహిళలు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారని చెప్పారు. వైద్యులందరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అన్నిరంగాలకు హైదరాబాద్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని పేర్కొన్నారు. మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడానికి వీ-హబ్ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో మహిళా యూనివర్సిటీని ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నామని వెల్లడించారు. జెండర్ ఈక్వాలిటీ పాటించే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటన్నారు. భారతీయ వైద్యరంగం ఎంతో పురోగతి సాధించిందని అన్నారు. కరోనా సమయంలో ఏఐజీ ఆస్పత్రి మంచి సేవలు అందించిందని కొనియాడారు.

బీజేపీకి రెబల్స్ పోటు

(మొదటిపేజీ తరువాయి)

సహా బీజేపీ నేతలంతా గట్టిగా ప్రచారం చేశారు. ప్రతిపక్షాలు ప్రచారంలో నిరుద్యోగం, వెనుకబాటుతనాన్ని తూర్పారపట్టాయి. దిల్లీ తరహా ఉచిత విద్యుత్, నీరు, విద్య, వైద్యం అందిస్తామని ఆప్ నేతలు ప్రచారం చేశారు. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే సరికొత్త రికార్డు కాబోతోంది. కాంగ్రెస్, రెండో స్థానంలో ఉండొచ్చని, ఆప్ పెద్దగా ప్రభావం చూపించకపోవచ్చని ఒపీనియన్ పోల్స్ వెల్లడించాయి. రెండో విడత ఎన్నికలకు సంబంధించిన ప్రచారం శనివారం 5 గంటలకు ముగిసింది. సోమవారం పోలింగ్ జరుగుతుంది. మొత్తం 93 నియోజకవర్గాలలో 833 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. గురువారం ఓట్ల లెక్కింపు జరుగుతుంది. రెండోదశలో ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, పటీదార్ నాయకుడు హార్దిక్ పటేల్, ఓబీసీ నేత అల్పేశ్ ఠాకూర్ వంటి ప్రముఖులు పోటీలో ఉన్నారు. హార్దిక్ పటేల్, ఠాకూర్ బీజేపీ టికెట్లపై రంగంలో దిగారు. డిసెంబరు 1న మొదటిదశ పోలింగ్ జరిగిన విషయం విదితమే. మొదటిదశలో 63.31శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. గతంతో పోలిస్తే ఇది చాలా తక్కువ. రెండో దశలో అహ్మదాబాద్, వదోదర, గాంధీనగర్ సహా ఉత్తర, దక్షిణ గుజరాత్‌లోని 14 జిల్లాల్లో 93 నియోజకవర్గాల్లో సోమవారం పోలింగ్ జరుగుతుంది. 2.54 కోట్లమంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

గుజరాత్ ఉత్తర ప్రాంతం బీజేపీకి గట్టి సవాల్ విసురుతోంది. ఓబీసీల ప్రాబల్యం అధికంగా ఉండే ఈ ప్రాంతంలో బనస్కాంత, పటన్, మెహసానా, సబర్కాంత, ఆరావళి, గాంధీనగర్ జిల్లాల పరిధిలో 32 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. గత రెండు దఫాలుగా ఇక్కడ కాంగ్రెస్‌దే పైచేయి. 2012, 2017 ఎన్నికల్లో ఆ పార్టీ 17 స్థానాలను గెలుచుకుంది. బీజేపీ 2012లో 15 స్థానాల్లో గెలిచింది. 2017లో 14 మాత్రమే వచ్చాయి. ప్రధానంగా అంజనా చౌధురి సామాజిక వర్గం ఆ పార్టీపై ఆగ్రహంతో ఉంది. దీనికి ప్రధాన కారణం మాజీ హోంమంత్రి విపుల్ చౌధురిని అరెస్టు చేయడమే. 2005-16 నడుమ డెయిరీ చైర్మన్‌గా ఉన్నప్పుడు రూ.800 కోట్ల అవినీతి జరిగిందని ఏడేళ్ల తర్వాత ఆయనపై ఫిర్యాదు అందింది. దీంతో ఏసీబీ ఈ ఏడాది సెప్టెంబరు 15న ఆయనను అరెస్టు చేసింది. ఇంతవరకు ఆయనకు బెయిల్ రాలేదు. సొంత పార్టీ ప్రభుత్వమే విపుల్‌ను అరెస్టు చేయడాన్ని అంజనా చౌధురి సామాజిక వర్గం జీర్ణించుకోలేకపోతోంది. ఈ వర్గం ప్రజలు ఉత్తర గుజరాత్‌లో కనీసం 30 నియోజకవర్గాల్లో బలంగా ఉన్నారు. 1,253 గ్రామాలకు చెందిన 2 లక్షల మంది 'అర్బుద సేన' పేరుతో గత నెలలో గాంధీనగర్‌లో చార్‌దా గ్రామంలో భారీ సభ పెట్టి తమ సత్తా చాటుకున్నారు. అర్బుద సేనను విపుల్ చౌధురే గత ఏడాది ఏర్పాటు చేశారు. ఇది రాజకీయేతర సంస్థ అయినా ఎన్నికల్లో కచ్చితంగా ప్రభావం చూపుతుందని విపుల్ వర్గీయులు బీజేపీకి సహకరించడం లేదని విశ్లేషకులు అంటున్నారు. విపుల్ సన్నిహితులు కొందరు ఆమ్ ఆద్మీ పార్టీ లో చేరాలని భావించారు. అయితే అవినీతి ఆరోపణలతో అరెస్టయిన విపుల్‌ను పార్టీలో చేర్చుకోవడానికి కేజ్రీవాల్ నిరాకరించారు. పైగా ఉత్తర గుజరాత్‌లో ఆప్ ఉనికి పెద్దగా లేదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందంటున్నారు. తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ 11 మంది సిటింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ టికెట్లు ఇవ్వగా, బీజేపీ ఆరుగురికే అవకాశం ఇచ్చింది. మిగతా స్థానాల్లో కొత్తవారిని బరిలోకి దించింది. పాటీదార్, కోలీ సామాజిక వర్గాల ప్రాబల్యం కూడా ఈ ప్రాంతంలో ఎక్కువే.

ఉపాధ్యాయుల వినతి మేరకే...

ఎన్నికల విధులకు దూరంపై మంత్రి బొత్స

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ఉపాధ్యాయుల కోరిక మేరకే ఎన్నికల విధుల నుంచి వారిని తప్పించామని, వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఓటమి భయంతోనే ఎన్నికల విధుల నుంచి ఉపాధ్యాయులను తప్పించారని నారా లోకేశ్ విమర్శించడంపై మంత్రి బొత్స స్పందిస్తూ ఆ విషయం ఉపాధ్యాయులను అడిగితే వాస్తవాలు చెబుతారన్నారు. బోధనేతర విధుల నుంచి తమను తప్పించాలని ఉపాధ్యాయులే అనేకసార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నారని, వారి విన్నపాన్ని పరిగణనలోకి తీసుకొనే ఉపాధ్యాయులకు ఆ వెసులుబాటు కల్పించామన్నారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ శ్రీకాకుళం పార్లమెంటరీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన శనివారం జరిగిన జయహో బీసీ సన్నాహక సభలో బొత్స మాట్లాడారు. నారా లోకేశ్‌కు రాజకీయ అవగాహన లేదని బొత్స విమర్శించారు. టీడీపీ అధికారంలో ఉండగా ఎన్ని పరిశ్రమలు వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. పెట్టుబడులు ఆకర్షించడంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఉత్తరాంధ్రకు వచ్చిన కంపెనీలు ఏమిటో ఆ పార్టీ నేతలే చెప్పాలని డిమాండ్ చేశారు. మూడున్నరేళ్లలో తమ ప్రభుత్వం చేసిన పనులు చెప్పడానికి బీసీ సభ నిర్వహిస్తున్నామన్నారు. జగన్ ప్రభుత్వంలో బీసీలకు

నూరుశాతం న్యాయం జరిగిందన్నారు. బీసీలంతా వైసీపీకి అండగా ఉంటారని, చంద్రబాబును బీసీలు సహా ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. వైసీపీ హయాంలో నామినేటెడ్ పదవులు ఎక్కువగా బీసీలకు ఇచ్చామన్నారు. ఈ నెల 7వ తేదీన విజయవాడలో నిర్వహించే బీసీ సభకు భారీగా హాజరై జయప్రదం చేయాలని వైసీపీ శ్రేణులు, బీసీలకు విజ్ఞప్తి చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి సీఎం జగన్ పాటుపడుతున్నారని చెప్పారు. వైసీపీపై బురదజల్లేందుకు ఎంత ప్రయత్నించినా ప్రజలు టీడీపీని నమ్మరన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ సాయిరాజ్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

సీమ అభివృద్ధిపై నిర్లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వంపై లెనిన్‌బాబు ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు: కర్నూలులో ఈనెల 5న నిర్వహించే సీమగర్జనలో కర్నూలులో హైకోర్టుతో పాటు కడప ఉక్కు ఫ్యాక్టరీ, రాయలసీమ యూనివర్సిటీ, అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీ కోసం నిధులు, హంద్రీనీవా కాలువ వెడల్పుతోపాటు వేదవతి గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణంపై ముఖ్యమంత్రి మాట్లాడాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. 49 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలను గెలిపించిన రాయలసీమ అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించడాన్ని శనివారం ఓ ప్రకటనలో విమర్శించారు. పరిశ్రమలు లేకపోవడంతో రాయలసీమ యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళుతున్నట్లు తెలిపారు. సీఎం రాయలసీమ వాసి అయినప్పటికీ ప్రభుత్వ

నిర్లక్ష్యం కారణంగా విద్య, వైద్యం, ఉపాధి రంగాలతో పాటు వ్యవసాయ రంగం పూర్తిగా వెనుకబడి ఉందని పేర్కొన్నారు. కర్నూలులో నిర్వహించే సీమగర్జన ఈ ప్రాంతానికి ఉపయోగపడేలా ఉండాలని, రాజకీయ లబ్ధి కోసం కాకుండా ప్రజల అజెండాను ప్రస్తావించాలని డిమాండ్ చేశారు. సీమగర్జన పేరుతో మరోసారి ప్రజలను మోసం చేస్తే తిరుగు బాటు తప్పదని హెచ్చరించారు.

ప్రభుత్వ టెర్రరిజంతోనే తెలంగాణకు 'అమరరాజా'

టీడీపీ అధినేత చంద్రబాబు ట్వీట్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ టెర్రరిజం వల్లే అమరరాజా పొరుగు రాష్ట్రానికి వెళ్లిపోయిందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. నాలుగు దశాబ్దాల ప్రస్థానంలో... రాయలసీమ ప్రాంతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు లక్ష కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచిన సంస్థ అమరరాజా అన్నారు. ఒక బిలియన్ డాలర్ కంపెనీ ఇప్పుడు సొంత రాష్ట్రం వదిలి పొరుగు రాష్ట్రానికి వెళ్లడానికి కారణం స్టేట్ స్పాన్సర్డ్ టెర్రరిజం కాదా? అని ప్రశ్నించారు. ఏపీలో పుట్టిన సంస్థ చిత్తూరు వదిలి రాష్ట్రం వెలుపల రూ.9500 కోట్ల పెట్టుబడి పెడుతోంది... ప్రతిష్టాత్మక సంస్థను ప్రోత్సహించాల్సింది పోయి... గతంలో ఇచ్చిన భూములు కూడా వెనక్కి తీసుకున్నారు... పర్యావరణ అనుమతులు, తనిఖీల పేరుతో నిత్యం ఇబ్బంది పెట్టారు... ఉపాధి నిచ్చే పరిశ్రమకు విద్యుత్

సరఫరా నిలిపివేసి శాడిజం చాటుకున్నారు... కోర్టు తప్పుపట్టినా మీ వైఖరి మార్చుకోలేదు... మీ రాజకీయ కక్షలతో ప్రజల ప్రయోజనాలనే కాదు... రాష్ట్ర ప్రతిష్టనే పణంగా పెట్టారు... రాష్ట్రానికి ఈ ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని ప్రజలు, చరిత్ర క్షమించవని చంద్రబాబు హెచ్చరిస్తూ ట్వీట్ చేశారు.

జే ట్యాక్స్, వేధింపులతోనే పారిశ్రామికవేత్తలు పరార్: దూళిపాళ్ళ

జగన్ రెడ్డి జేట్యాక్స్, వైసీపీ నేతల వేధింపులు, ప్రభుత్వ అసంబద్ధవిధానాలతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి పరారవుతున్నారని టీడీపీ సీనియర్ నేత దూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో కప్పం కట్టలేకే ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నామని పారిశ్రామికవేత్తలు బహిరంగంగానే చెబుతున్నారన్నారు. ఏపీలో ఉన్న పరిశ్రమలన్నీ జగన్ దెబ్బకు పొరుగురాష్ట్రాల బాటపడుతుంటే, ఆయన సొంత కంపెనీలు, బినామీల కంపెనీలు మాత్రం దేదీప్యమానంగా కళకళలాడుతున్నాయన్నారు. టీడీపీ హయాంలో పెట్టుబడుల ఆకర్షణలో గుజరాత్‌తో పోటీపడిన ఏపీ, జగన్ జమానాలో దేశంలో 14వ స్థానానికి దిగజారిందన్నారు. 178 మిలియన్ల విదేశీపెట్టుబడులతో (ఎఫ్‌డీఐలు) ఏపీ అన్ని రాష్ట్రాలకంటే దిగువన ఉందన్నారు. కర్ణాటక 18,554 మిలియన్లు, తమిళనాడు 3023 మిలియన్లు, తెలంగాణ 1584 మిలియన్ల విదేశీపెట్టుబడులు సాధించాయని దూళిపాళ్ళ వివరించారు. ఏపీకి తలవంపులు తెచ్చేలా జగన్ రెడ్డి అండ్ కో అవలంభిస్తున్న దోపిడీ విధానాలకు తక్షణమే స్వస్తిచెప్పాలని సూచించారు.

ఆక్వా రంగం కుదేలుకు పాలకుల కుమ్మక్కు

విశాలాంధ్ర-అమలాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై ఆక్వా రంగాన్ని కుదేలు చేస్తున్నాయని, నకిలీ సీడ్స్‌ను రైతులకు అందిస్తూ మోసాగిస్తున్నాయని, రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి కోలుకోలేని దెబ్బతిన్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేగా ప్రభాకర్ విమర్శించారు. శనివారం అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆక్వా రైతులు దయనీయ పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఆక్వా ఉత్పత్తులు కొనే ఎగ్జిబిటర్స్ సిండికేట్‌గా మారి రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఆక్వా ఉత్పత్తుల కొనే వారు లేక ధరలు తగ్గించుకుంటూ రైతుల్ని నష్టాల బారిన పడేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆక్వా రంగంలో దళారులు బెడద అధికంగా ఉందని, పెట్టుబడులు కూడా రాక రైతులు దళారుల మోసాలకు బలవుతున్నారని ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. టిడ్కో ఇళ్లు నిర్మించి మూడున్నరేళ్లు గడిచినా జగన్ ప్రభుత్వం పేదలకు పంచకుండా ఇబ్బందుల పాల్జేస్తోందని, పేదలకు వెంటనే ఇళ్లు ఇవ్వాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. జగనన్న కాలనీలు మాయగా మారాయన్నారు. కాకినాడ జిల్లా కార్యదర్శి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కె సత్తిబాబు, చెల్లుబోయిన కేశవ శెట్టి, శీలం వెంకటేశ్, పెద్దిరెడ్డి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఉక్కు పాదయాత్రను జయప్రదం చేయండి

కడప ఉక్కు పరిశ్రమ సాధించే వరకు పోరాటం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు

విశాలాంధ్ర-కడప రూరల్: కడప ఉక్కు పరిశ్రమకు పునాది రాయి వేసి మూడేళ్లలో పూర్తి చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడేళ్లు పూర్తి కావస్తున్నా పరిశ్రమ పురోగతి లేని దౌర్భాగ్యస్థితిలో ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు ఎద్దేవా చేశారు. శనివారం సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సమావేశానికి హాజరయిన ఓబులేసు మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమకు ముగ్గురు ముఖ్యమంత్రులు మూడు పునాదిరాళ్లు వేశారే తప్ప నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టలేదని, ప్రజలు మౌనంగా ఉంటే పునాది రాళ్లే గతి అవుతాయని అన్నారు. కడప ఉక్కు పరిశ్రమ సాధన కోసం సీపీఐ పాదయాత్ర చేపట్టిందని, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఐదు రోజులపాటు పాదయాత్రలో పాల్గొంటారని తెలిపారు. ఈ పాదయాత్రలో ప్రజలు, విద్యా ర్థులు, యువత, కార్మికులు అందరూ పాల్గొనాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి

వచ్చిన ఆరు నెలలకు ఉక్కు పరిశ్రమకు పునాదిరాయి వేసి మూడేళ్లలో పూర్తి చేస్తామని, జిల్లాలో చదువుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పినప్పటికీ, ఉక్కు పరిశ్రమ ప్రహరీ గోడకే పరిమితం కావడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువచ్చి, ఉక్కు పరిశ్రమకు నిధులు సమీకరించి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టంలో కడప ఉక్కు పరిశ్రమపై చర్చించేందుకు అనేక పోరాటాలు చేశామని, ఇప్పుడు నిర్మాణం చేపట్టడం కోసం ప్రభుత్వంపై యుద్ధం చేయాల్సిన అవసరం ఏర్పడిందని అన్నారు. కడప ఉక్కు పరిశ్రమను సాధించే వరకు పోరాటం చేస్తూనే ఉంటామని తెలిపారు. సీఎం జగన్ కేసులకు భయపడి బీజేపీ విష కౌగిలిలో ఒదిగి ఉన్నారని, కేంద్ర ప్రభుత్వంతో గట్టిగా కాదు కదా... చిన్నగా కూడా మాట్లాడటం లేదని తీవ్రంగా విమర్శించారు. 151 సీట్లు గెలిచామన్న అహంకారాన్ని త్వరలోనే ప్రజలు దింపుతారని హెచ్చరించారు. ఈ పాదయాత్ర ప్రారంభం, ముగింపు కార్యక్రమాలకు సీపీఐ జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి జి.చంద్ర, నగర కార్యదర్శి ఎస్.వెంకట శివ, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణమూర్తి, రామయ్య, నాగ సుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, వీరశేఖర్, బషీరున్నీసా, విజయలక్ష్మి, వేణుగోపాల్, బాదుల్ల, గంగాసురేశ్, జిల్లా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీమగర్జనకు భారీ ఏర్పాట్లు

జన సమీకరణపై వైసీపీ దృష్టి

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: కర్నూలు నగరంలో రాయలసీమ గర్జనకు వైసీపీ నేతలు భారీ ఏర్పాట్లు చేయడమే కాకుండా పెద్దఎత్తున జన సమీకరణపై దృష్టిసారించారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులను, వైసీపీ కార్యకర్తలను తరలించేందుకు ఆ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించారు. గత నెలలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లా పర్యటన విజయవంతం అవడమే కాకుండా కోడుమూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆదోనిలో చంద్రబాబు రోడ్ షోకు ఊహించని విధంగా జనాలు తరలిరావడం, వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరులో చంద్రబాబు పర్యటన గడువుకన్నా నాలుగు గంటలు ఆలస్యమైనా ప్రజలు అర్ధరాత్రి వరకు ఎదురుచూడటం పై చంద్రబాబు కూడా ఆశ్చర్యం చెందారు. చంద్రబాబు పర్యటనలో ఒకే రాజధాని కావాలని ప్రజలతో చెప్పించడం, కర్నూలు, పత్తికొండలో చంద్రబాబు రాయలసీమ ద్రోహి, చంద్రబాబు గోబ్యాక్ అంటూ వైసీపీ శ్రేణులు నినాదాలు చేయడం, పర్యటనను అడ్డుకునేందుకు ప్రయత్నించడం తెలిసిందే. అయితే చంద్రబాబు పర్యటన విజయ వంతం కావడం పై వైసీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇందుకు ప్రతిగా కర్నూలు న్యాయ రాజధాని కాకుండా చంద్రబాబు నాయుడు అడ్డుకుం టున్నారని, మూడు రాజధానులకు చంద్రబాబు వ్యతిరేకమంటూ, రాయలసీమలో వైసీపీకి తిరుగులేదని, రాయలసీమ ప్రజలు వైసీపీ వెంటే ఉన్నారని తెలియచేసేందుకు కర్నూలులో సీమగర్జనకు వైసీపీ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందుకు జగన్ సలహాదారు సజ్జలతో పాటు రాయలసీమకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు సీమగర్జనను విజయవంతం చేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలను పిలిపించి ప్రతి కళాశాల నుంచి నాలుగు బస్సులు, విద్యార్థులను పంపించే విధంగా మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి మూడు జిల్లాల నుంచి పెద్దఎత్తున విద్యార్థులు, ప్రజలు లక్ష మంది హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

టికెట్లు ఉన్నవారికే వైకుంఠ ద్వార దర్శనం

'డయల్ యువర్ ఈఓ'లో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

విశాలాంధ్ర-తిరుమల : వైకుంఠ ఏకాదశి టికెట్లు కలిగి ఉన్న భక్తులను మాత్రమే వైకుంఠ ద్వార దర్శనానికి అనుమతిస్తామని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. టోకెన్లు లేని వారు తిరుమలకు రావచ్చునీ, కానీ స్వామి దర్శనానికి అనుమతించమని చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, జనవరి 2న వైకుంఠ ద్వార దర్శనం ఉంటుందని, 11వ తేదీ వరకు వైకుంఠ ద్వారాలు తెరిచి ఉంటాయని ఈవో వెల్లడించారు. గతంలో మాదిరే పది రోజులు పాటు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రోజుకు 25 వేలు చొప్పున రూ.300 ప్రత్యేక ప్రవేశ టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తామని చెప్పారు. దేశంలో ఏ ప్రాంతం నుంచి అయినా భక్తులు టికెట్లు బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా రోజుకు 50 వేలు చొప్పున 10 రోజులకు కలిపి 5 లక్షల సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లను తిరుపతిలో కౌంటర్ల ద్వారా భక్తులకు మంజూరు చేస్తామని వివరించారు. ఈ నెల 16న సాయంత్రం 6.12

గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభంకానుండడంతో 17 నుంచి స్వామి వారికి నిర్వహించే సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదిస్తారని చెప్పారు. కాగా, ధనుర్మాస ఘడియలు 2023, జనవరి 14న ముగుస్తా యన్నారు. టీటీడీ ఆగమ సలహామండలి సూచనల మేరకు తిరుమల ఆనంద నిలయం బంగారు తాపడం పనుల కోసం ఫిబ్రవరి 23 నుంచి బాలాలయ నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. ఆరు నెలల్లో తాపడం పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిం చామన్నారు. భక్తులు సమర్పించిన బంగారాన్ని మాత్రమే వినియోగిస్తామని చెప్పారు. తిరుమల ఆలయంలో ఈ నెల 7న కార్తీక పర్వదీపోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ నరసింహ కిషోర్, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్ కుమార్, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వర రావు, ఎస్ఈ-2 జగదీశ్వర్‌రెడ్డి, ఆరోగ్యశాఖాధికారి శ్రీదేవి, డిఎఫ్ఓ శ్రీనివాస్, అన్నప్రసాదం ప్రత్యేకాధికారి శాస్త్రి పాల్గొన్నారు.

పరిశ్రమలు తరలిపోవడానికి జగనే కారణం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీశ్

విశాలాంధ్ర-గుంతకల్లు: రాష్ట్రంలో పరిశ్రమలు తరలిపోవడానికి సీఎం జగన్ మోహన్ రెడ్డే కారణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ జగదీశ్ విమర్శించారు. శనివారం అనంతపురం జిల్లా గుంతకల్లులోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతపురం జిల్లా, రాప్తాడు జాకీ పరిశ్రమ 6వేల మందికి ఉపాధి కల్పించనున్న కంపెనీని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి 2019లో రూ.10 కోట్లు డిమాండ్ చేసి బెదిరించినందున పరిశ్రమ తెలంగాణ వెళ్లిపోవడానికి కారకులయ్యారన్నారు. హిందూపురం సమీపంలోని కియా పరిశ్రమ అనుబంధ సంస్థలను కూడా అక్కడున్న ఎంపీ బెదిరించడంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నాయన్నారు. అమర్ రాజా బ్యాటరీ సంస్థను, విశాఖలోని నూలు పరిశ్రమలను పొగపెట్టి పంపించేశారన్నారు. ప్రకాశం జిల్లాలో 24 వేల కోట్ల రూపాయల పెట్టుబడుల కాగిత పరిశ్రమ తరలి పోయిందన్నారు. విశాఖ, చిత్తూరుల్లో రూ.727 కోట్లతో రేటింగ్ కంపెనీని పొగపెట్టి పంపించారన్నారు. తిరుపతి దగ్గర రియల్ ఎస్టేట్ భూములు తీసుకున్నవి కూడా వెనక్కి వెళ్లిపోయారన్నారు. ఎర్ర తివాచి పరిశ్రమలకు పొగ పెట్టి పంపించారన్నారు. దీనివల్ల ఉపాధి ప్రత్యక్షంగా, పరోక్షంగా లేకుండా పోయిందని, ప్రభుత్వానికి కూడా పెద్ద ఎత్తున నష్టమొచ్చిందన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్ పనులు లేనందున పొక్లయిన్లు, ఇటాచీలు, టిప్పర్లు, క్రేన్లు అమ్ముకుంటు న్నారన్నారు. అభివృద్ధి నిరోధకమైన చర్యలు అవలంబిస్తూ, కక్ష సాధింపులతో వేధిస్తున్నారన్నారు. 26 జిల్లాలో కొత్త పరిశ్రమలు లేకుండా పోయాయన్నారు. అభివృద్ధి చెందుతున్న సాఫ్ట్‌వేర్ కంపెనీలను కూడా వేధిస్తున్నందున ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లిపోతున్నాయన్నారు. ఇంత జరుగుతున్న ప్రభుత్వానికి చింత లేదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బీ గోవిందు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్ గౌడ్, సీపీఐ నియోజక వర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, సీపీఐ నియోజికవర్గం సహాయ కార్యదర్శి బి.మహేశ్, సీపీఐ మండల కార్యదర్శి రాము రాయల్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఈశ్వరయ్య, సీపీఐ నాయకులు మక్బుల్ బాషా, ఉమర్ బాషా, లింగన్న, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో కీలక మార్పులు: కాకాని

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ రంగంలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టారని వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన వ్యవసాయ యాజమాన్య పద్ధతులను గ్రామస్థాయిలో రైతు ముంగిటకే అందిస్తున్నారని పేర్కొన్నారు. శనివారం లాంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో అగ్రిటెక్ 2022 అత్యాధునిక వ్యవసాయ సాంకేతికతలపై సదస్సు, ప్రదర్శనను మంత్రి కాకాని, విశ్వ విద్యాలయం ఉప కులపతి డా.ఏ.విష్ణువర్ధన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు (వ్యవసాయం, మార్కెటింగ్) బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవితో కలసి ప్రారంభించారు. ప్రదర్శనను ప్రారంభించి ఆచార్య ఎన్జీ వ్యవసాయ విశ్వ విద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లా ఉద్యాన, వ్యవసాయ, ప్రకృతి సేద్యం శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్, వివిధ రకాల కంపెనీల విత్తన, పురుగుమందులు, ఎరువులు, వ్యవసాయ యంత్ర పరికరాల స్టాల్స్‌ను మంత్రి పరిశీలించారు. జాతీయ స్థాయిలో అత్యంత ప్రసిద్ధి చెందిన నూతన వరి, శనగ వంగడాలను అందించిన ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ విద్యా దినోత్సవం సందర్భంగా అత్యాధునిక వ్యవసాయ సాంకేతికతలపై, నూతన వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో ప్రదర్శనను, సదస్సు ఏర్పాటు చేయటం ఎంతో అభినందనీయం అన్నారు. దేశవ్యాప్తంగా వినియోగిస్తున్న వరి, శనగ వంగడాల రకాలలో ఇక్కడ పరిశోధన చేసి రూపొందించినవే 75శాతం ఉన్నాయన్నారు. రైతులు ప్రతిసారి ఒకే పంటను సాగు చేయకుండా భూసారానికి అనుగుణంగా డిమాండ్ ఉన్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా అధిక ఆదాయాన్ని ఆర్జించ వచ్చన్నారు. వ్యవసాయంలో రైతుకు మించిన శాస్త్రవేత్తలు ఉండరని, నిరంతరం పొలాల్లో పనిచేసే రైతులకు అన్ని పరిస్థితులపై అవగాహన ఉంటుందన్నారు. ఉపకులపతి డా.ఏ.విష్ణు వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మూడు రోజులు జరిగే అగ్రిటెక్ 2022లో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసిన మేలు రకమైన విత్తనాలతో పాటు, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులు, వివిధ కంపెనీల పురుగు మందులు, అత్యాధునిక వ్యవసాయ యంత్రపరికరాలు ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. పంటల సాగులో ఎరువులు, పురుగు మందుల పిచికారికి తొలిసారిగా డ్రోన్ టెక్నాలజీని వినియోగించటానికి అవసరమైన శిక్షణ అందించేందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందన్నారు. ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డ్రోన్ పైలెట్ శిక్షణను పూర్తి చేసుకున్న తొలి బ్యాచ్ అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందించారు. వివిధ పరిశోధన సంస్థలు, విస్తరణ కేంద్రాలు అభివృద్ధి చేసిన లఘు చిత్రాలు, వ్యవసాయ ప్రచురణలను ఆవిష్కరించారు. వ్యవసాయ పరిశోధన సంచాలకులు డా.ఎల్.ప్రశాంతి, రిజిస్ట్రార్ డా.జి రామారావు, విస్తరణ సంచాలకులు పి రాంబాబు, డైరెక్టర్ ఎం దినేశ్ బాబు, ఉద్యాన శాఖ ఉప సంచా లకులు సుజాత, శాస్త్రవేత్తలు, రైతు సంఘాల ప్రతినిధులు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలుష్య పరిశ్రమలకు నోటీసులివ్వడం తప్పా?

ప్రభుత్వ వేధింపులే ఉంటే 'హెరిటేజ్' ఎలా నడుపుతారు: అమర్నాథ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలను కానీ, రాబోయే పరిశ్రమలను కానీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రాజకీయ కోణంలో చూడటం లేదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు. స్థానిక సర్క్యూట్ హౌస్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి విఘాతం కలిగించే విధంగా రెండు దినపత్రికలు ప్రచురించిన తప్పుడు కథనాలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయని, ఇందులో భాగంగానే అమర్ రాజా బ్యాటరీస్ తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుందన్న ఒకే కథనం రెండు దినపత్రికల్లో ప్రచురితం కావడాన్ని బట్టి చూస్తే, ఇది చంద్రబాబు నాయుడు స్క్రిప్ట్ అని అర్థమవుతుందని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని బదనాం చేయాలన్న దుర్మార్గపు ఆలోచనతో అవాస్తవాలను ప్రచురిస్తున్నాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అమర్ రాజా కంపెనీని వెళ్లగొట్టడానికి ప్రభుత్వం హుకుం జారీ చేసిందని ఈ మీడియా చేస్తున్న ప్రచారం నీచాతి నీచంగా ఉందని అన్నారు. అమర్ రాజా యాజమాన్యం... ఏపీలో ఉండలేకపోతున్నాం, పక్క రాష్ట్రాలకు వెళ్లిపోతున్నామని ఆంధ్రజ్యోతి రాధాకృష్ణకు, ఈనాడు రామోజీరావుకు చెప్పుకుందా? అని ఆయన ప్రశ్నించారు. అమర్ రాజాకు చెందిన పలు కంపెనీలు ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో నడుస్తున్నాయన్న విషయాన్ని గుర్తు చేశారు. అమర్ రాజా సంస్థ తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక ఎంపీకి సంబంధించింది కాబట్టి ఇటువంటి

కథనాలు రాస్తున్నా యని అమర్నాథ్ దుయ్య బట్టారు. కాలుష్యాన్ని వెదజల్లే కంపెనీల విషయంలో తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరి స్తుందని, అమర్ రాజా నుంచి కాలుష్యం విడుదలవుతుందని గుర్తించి నోటీసులు ఇచ్చా మన్నారు. దీనిపై వారు హైకోర్టుకు వెళ్లగా కాలుష్య నియంత్రణకు చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని హైకోర్టు ప్రభుత్వానికి సూచించిందని వివరించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ యాజమాన్యం సుప్రీంకోర్టుకు వెళ్లిందని అమర్నాథ్ వివరణ ఇచ్చారు.

చంద్రబాబు నాయుడుకు చెందిన హెరిటేజ్ కంపెనీ కార్పొరేట్ కార్యాలయం హైదరాబాదులో ఉన్నా, హెరిటేజ్ సామ్రాజ్యమంతా ఆంధ్రప్రదేశ్‌లోనే విస్తరించి ఉంది కదా? దాని జోలికి ఎప్పుడైనా మా ప్రభుత్వం వెళ్లిందా? అని ఆయన ప్రశ్నించారు. రాజకీయ కోణంలోనే చూస్తే ఏపీలో హెరిటేజ్ కంపెనీని నడిపించగలరా? అని అన్నారు. రాష్ట్రం నుంచి లక్ష డెబ్బై మూడు వేల కోట్ల రూపాయలు పెట్టుబడి వెనక్కి వెళ్లిపోయాయన్న తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్న ఆ పత్రికలు క్షమాపణ చెప్పాలని అమర్నాథ్ డిమాండ్ చేశారు. కాకినాడలో సుమారు రూ.వంద కోట్లతో యాంకరేజ్ పోర్టును అభివృద్ధి చేస్తున్నామని తెలియజేశారు. ఆక్వా ఎగుమతులలో 45 శాతం ఏపీ నుంచే జరుగుతున్నాయని చెప్పారు. ఇకనైనా చంద్రబాబు ఆయన తోక పత్రికలు తప్పుడు ప్రచారాలు మానుకోవాలని మంత్రి హితవు పలికారు.

దివ్యాంగులు సకలాంగులకు తీసిపోరు: కలెక్టర్

విభిన్న ప్రతిభావంతులకు ట్రై మోటార్ బైక్‌ల అందజేత

విశాలాంధ్ర-విజయనగరం: ప్రతిభలో దివ్యాంగులు సైతం సకలాంగులకు తీసిపోరని కలెక్టర్ ఎ.సూర్యకుమారి అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పది మంది విభిన్న ప్రతిభావంతులకు ట్రై మోటార్ బైకులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలను సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. అవకాశాలను అందిపుచ్చుకొని, కష్టపడి చదవడం ద్వారా వృద్ధిలోకి రావాలని సూచించారు. ప్రతి తల్లి ఆరోగ్యవంతమైన బిడ్డను కనాలని అనుకుం టుందని, అయితే రక్తహీనత, పోషకాహార లోపం, మేనరిక వివాహాలు తదితర కారణాల వల్ల దివ్యాంగులుగా శిశువులు జన్మిస్తున్నారని తెలిపారు. వీటి నివారణకు ప్రభుత్వం పోషకా హారాన్ని పంపిణీ చేస్తోందని చెప్పారు. రేషన్ డిపోలద్వారా పంపిణీ చేస్తున్న పోర్టిఫైడ్ బియ్యాన్ని ఆహారంగా తీసుకుని రక్తహీనతను నివారించుకోవాలని సూచించారు. విజయనగరం మేయర్ వెంపడాపు విజయ లక్ష్మి మాట్లాడుతూ, దివ్యాంగులు సైతం వివిధ రంగాల్లో తమ ప్రతిభను నిరూపించు కుంటున్నారని అన్నారు. జిల్లా విభిన్న ప్రతిభా వంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జీవీబీ జగదీష్ మాట్లాడుతూ, జిల్లాలో విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. వివిధ రకాల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. దివ్యాం గులకు ల్యాప్‌టాప్‌లు, టచ్ ఫోన్లు, ట్యాబ్‌లు పంపిణీ చేశారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శ నలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతీదేవి, ఆర్‌టీవో ఆదినారాయణ, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ వీఏ స్వామినాయుడు, ప్రముఖ సామాజికవేత్త పీవీ నర్సింహరావు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఇదీ మన న్యాయం!

ఒకే విధమైన కేసులో భిన్న న్యాయస్థానాలే కాదు... భిన్న న్యాయమూర్తులు సైతం పరస్పర విరుద్ధమైన తీర్పులు చెప్పడం పరిపాటి అయిన తరుణంలో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయంలో పరిశోధక విద్యార్థి ఉమర్‌ఖాలిద్, యునైటెడ్ అగెనెస్టు హేట్ సభ్యుడు ఖాలిద్ సైఫీలపై గల కేసును శనివారం కోర్టు కొట్టేసి నిర్దోషిగా ప్రకటించడం సంతోషించదగ్గ పరిణామమే. 2020లో ఈశాన్య ఢిల్లీలో మత కలహాలతో సంబంధం ఉందన్న కేసులో ఢిల్లీ కోర్టు వీరిద్దరినీ నిర్దోషులుగా ప్రకటించింది. అయితే వీరిద్దరి మీద చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(యు.ఎ.పి.ఎ.) కేసులు కూడా మోపారు. ఢిల్లీ మతకలహాల కేసులో ఉమర్ ఖాలిద్‌కు శిక్ష విధించవలసి వస్తే ఆ శిక్ష ఎంతకాలం ఉండేదో పక్కన పెడితే ఇప్పటికే ఆయనను రెండేళ్ల రెండునెలల పైగా ఎలాంటి విచారణలేకుండా జైలులో మగ్గేట్టు చేశారు. యు.ఎ.పి.ఎ. కింద ఎవరిమీదైనా తీవ్ర ఆరోపణలు మోపి నిరవధికంగా జైలులో ఉంచేయడమే లక్ష్యం అన్న అభిప్రాయం బలంగా నాటుకుని ఉంది. చాలామంది న్యాయమూర్తులు యు.ఎ.పి.ఎ. కింద ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి బెయిలు మంజూరు చేయడానికి కూడా జడుస్తున్నారు. కొన్నిసార్లు బెయిలు మంజూరు చేసిన జడ్జీలూ ఉన్నారు. అందువల్ల ఉమర్ ఖాలిద్‌కు యు.ఎ.పి.ఎ. కేసులో బెయిలు వస్తుందో లేదో, ఒక వేళ వచ్చినా ఎన్నాళ్లకు వస్తుందో తెలియదన్న అభిప్రాయం బలంగా ఉంది. బెయిలు హక్కు జైలులో ఉంచడం అరుదుగా మాత్రమే జరగాలని సుప్రీంకోర్టు పదే పదే చెప్పినా కింది స్థాయి న్యాయస్థానాల్లో బెయిలు మంజూరు చేయడానికి జడ్జీలు వెనుకాముందాడుతున్నారు. ఆ మాట ఇటీవల సాక్షాత్తు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్ర చూడే చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఢిల్లీలోని అదనపు సెషన్స్ జడ్జి పులస్త్య ప్రమచలా...ఉమర్ ఖాలిద్, సైఫీలను నిర్దోషులుగా ప్రకటించడం మంచి పరిణామం. అసలు ఈ కేసు నమోదైన తీరే విచిత్రమైంది. ఈశాన్య ఢిల్లీలోని చాంద్‌బాగ్ ప్రాంతంలో విధి నిర్వహణలో ఉన్న ఒక పోలీసు జవాను ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈ కేసు నమోదైంది. అల్లర్లు జరుగుతున్నప్పుడు ఆ పోలీసు జవాన్ ఒక చోట తలదాచుకున్నాడట. అప్పుడు అల్లరి మూకలు ఆ ప్రాంతంలో రాళ్లు విసిరారట. కొన్ని వాహనాలను దగ్ధం చేశారట. పోలీసుజవాను తల దాచుకున్న భవనం ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ కౌన్సిలర్ తాహిర్ హుసేన్‌కు చెందిందట. ఆ భవనంనుంచే రాళ్లు విసిరారట. పోలీసు జవాను ఇచ్చిన ఈ వాంగ్మూలం ఆధారంగానే ఉమర్ ఖాలిద్, సైఫీ మీద కేసు నమోదైంది. ఇదంతా పెద్ద కుట్రలో భాగమని పోలీసులు వాదించారు. ఇంత కాలం ఉమర్ ఖాలిద్‌కు బెయిలు మంజూరు చేయడానికి నిరాకరించిన న్యాయస్థానాలు పోలీసుల కథనాన్నే నమ్మాయి. ఏలినవారికి గిట్టని వారిని నిరవధికంగా, బెయిలు కూడా ఇవ్వకుండా ఏళ్ల తరబడి జైలులో ఉంచడానికి సదుపాయం ఉంది. కానీ బెయిలుహక్కు అని అత్యున్నత న్యాయస్థానం చెప్పినా బెయిలు రావడానికి భూమ్యాకాశాలను ఏకం చేయాల్సిందే.

ఉమర్‌ఖాలిద్‌కు ఇంతకుముందు కూడా ఒకసారి బెయిలు మంజూరు అయింది. కానీ యు.ఎ.పి.ఎ. కింద తీవ్ర ఆరోపణలున్న మరోకేసులో బెయిలు రాలేదు కనక విడుదల కాలేదు. వేర్వేరు న్యాయస్థానాలు ఒకేరకమైన కేసుల్లో భిన్నమైన తీర్పులు ఇవ్వడం జరిగింది. ముఖ్యంగా యు.ఎ.పి.ఎ. కేసుల్లో న్యాయం జడ్జీనిబట్టి ఉంటోంది. అంటే వ్యక్తులకు స్వేచ్ఛ లభించడం లేదా నిరాకరించడం ఓ లాటరీ లాంటిదన్న మాట. ముంబై, ఢిల్లీ హైకోర్టులు వేర్వేరు సందర్భాలలో వ్యవహరించిన విధానమే దీనికి నిదర్శనం. ఒకే కోర్టులో ఒకే న్యాయమూర్తి ఒకే రకమైన వేర్వేరు కేసుల్లో భిన్నమైన నిర్ణయం ప్రకటించిన ఉదంతాలూ ఉన్నాయి. ఇలా జడ్జీల వ్యవహార సరళినిబట్టి బెయిలు మంజూరు కాకపోతే వారాలు, నెలలే కాదు... సంవత్సరాల తరబడి జైలులో మగ్గిపోవాల్సిందే. ఉమర్ ఖాలిద్ కేసులో జరిగింది అదే. భీమా కోరేగావ్ కేసులోను బెయిలుమీద విడుదలైన కొద్దిమందిని మినహాయిస్తే మిగతా వారి పరిస్థితీ అదే. యు.ఎ.పి.ఎ. కేసుల్లో న్యాయ నిర్ణయం ఒకేరకంగా జరగడం లేదు. ఎల్గార్ పరిషత్ కేసులో అరెస్టయిన కబీర్‌కళామంచ్‌కు చెందిన జ్యోతీ జగ్తాప్ ఇప్పటికీ బెయిలురాక జైలులోనే మగ్గిపోతున్నారు. జ్యోతి జగ్తాప్ భీమా కోరేగావ్ సంఘటన జరగడానికి ముందు పాటలుపాడి, ఉపన్యాసాలిచ్చి జనాన్ని రెచ్చగొట్టారట. తీరా ఆమె మీద కేసుమోపినప్పుడు మాత్రం భీమా కోరేగావ్ సంఘటన జరగక ముందు ఆమె పాటలుపాడి, ఉపన్యాసాలు ఇచ్చి రెచ్చగొట్టారన్న వివరమే ఎఫ్.ఐ.ఆర్.లో లేదు. ఆ తరవాత జరిగిన సంఘటనలను మాత్రమే ఎఫ్.ఐ.ఆర్.లో ప్రస్తావించారు. నిందితులు పెద్దకుట్రలో భాగస్వాములని ప్రాసిక్యూషన్ వాదిస్తుంది. న్యాయస్థానాలు ఆ మాటను నమ్మేస్తున్నాయి. బెయిలు నిరాకరిస్తున్నాయి. జ్యోతీ జగ్తాప్ కేసులో ఈ వైపరీత్యానిదే ప్రధాన పాత్ర. ఆమె నిషేధంలో ఉన్న సీపీఐ (మావోయిస్టు)లో క్రియాశీల సభ్యురాలన్న ఆరోపణ ఉంది. బొంబాయి హైకోర్టు ఈ వాదనను నమ్మేసింది.

జ్యోతీ జగ్తాప్ 'అచ్ఛేదిన్' అన్న మాటను హేళన చేశారట. ఆధునిక భారత్‌లో దళితులమీద అఘాయిత్యాలు జరుగుతున్నాయని అన్నారట. పోలీసులు అల్లే ఈ కథలే వ్యక్తుల స్వేచ్ఛకు సంకెళ్లు కావడం వైపరీత్యమే. నిషేధిత సంస్థతో సంబంధం అంటే క్రియాశీల సభ్యత్వం ఉండాలని, హింసను రెచ్చగొట్టిన దాఖలాలు ఉండాలనీ కేవలం ఆ నిషేధిత సంస్థ సమావేశాలకు హాజరైతే వారు తీవ్రవాదులో, మావోయిస్టులో కాదని సుప్రీంకోర్టు ఆరూప్ భూయాన్ కేసులో స్పష్టం చేసింది. అయితే ఈ మాటను పట్టించుకునే జడ్జీలను కాగడావేసి వెతికి పట్టించుకోవలసిందే. 2022 మార్చిలో ఉమర్ ఖాలిద్ బెయిలు వ్యవహారం సెషన్స్‌కోర్టులో ప్రస్తావనకు వచ్చినప్పుడు జడ్జీలు బెయిలు నిరాకరించడానికి హేతుబద్ధమైన కారణం కన్నా ప్రభుత్వ అనుకూలవైఖరి అనుసరించే ధోరణే ప్రధానమైందిగా కనిపిస్తోంది. ఎందుకంటే ఢిల్లీలో మతకలహాలు జరిగినప్పుడు ఉమర్‌ఖాలీద్ కనీసం ఢిల్లీలో లేరు. యు.ఎ.పి.ఎ. ప్రకారం అయితే దేశ సమైక్యతకు ముప్పు ఏర్పడవలసిన అగత్యమే లేదు. అలాంటి ప్రమాదం ఉందని ఏలినవారు భావిస్తే కేసులు దాఖలై పోతున్నాయి. అలాగే తీవ్రవాదానికి పాల్పడనక్కర్లేదు. పాల్పడే అవకాశం ఉందని ఏలినవారు అనుకున్నా ఎవరినైనా కటకటాల వెనక్కు తోసేయొచ్చు. ఇదీ మన న్యాయం.

ఆర్థిక అసమానతల ఊబిలో భారతం

మన దేశ జనాభా అనుభవిస్తున్న ప్రధాన సమస్య 'ఆదాయ అసమానతలు'. ఆదాయ, సంపదల వ్యత్యాసాలు ఉన్న సమాజంలో అసంతృప్తులు, అశాంతి పెరుగుతాయి. ప్రపంచ సంపదలో 82శాతం ఒక శాతం జనాభా చెంతనే ఉండగా, దాదాపు సగం జనాభా (370 కోట్లు) పేదరికంలో మగ్గుతున్నారని తేలింది. గత దశాబ్దంలో కుబేరుల ఆదాయం 6 రెట్లు పెరగగా, సాధారణ శ్రామికవర్గ ఆదాయం ఏటా 2శాతం మాత్రమే పెరిగింది. ప్రపంచ బిలియనీర్ల జాబితాలో ఇండియా 3వ స్థానంలో (అమెరికా, చైనా తరువాత) ఉన్నది. కోవిడ్-19 కారణంగా దేశంలో 75 మిలియన్ల పేదలు అదనంగా పెరిగారు. ప్రపంచవ్యాప్తంగా 689 మిలియన్ల కడుపేదలు ఉండగా, ఇండియాలో వారి సంఖ్య 139 మిలియన్లు(20శాతం) ఉన్నది. ప్రపంచ జనాభాలో 17.8శాతం ఇండియన్లు ఉన్న విషయం మనకు తెలుసు. ఇండియాలో 2019 ఏడాదిలో 102 మంది బిలియనీర్లు ఉండగా, 2020లో వారి సంఖ్య 140కి పెరిగి, వారి సంపద దాదాపు రెట్టింపు (596 బిలియన్ డాలర్లు) అయ్యింది. భారత దేశంలో 73శాతం సంపద 1శాతం జనాభా వద్దనే ఉన్నదని, 67 కోట్ల భారతీయులు (దాదాపు 50శాతం) పేదరికంలో ముగ్గుతున్నారని సర్వే ఫలితాలు వివరిస్తున్నాయి. ప్రపంచ అసమానతల ల్యాబ్ రిపోర్ట్ ప్రకారం 1980ల్లో చేపట్టిన ఆర్థిక సరళీకరణ విధానం అనంతరం అత్యధిక జనాభా కలిగిన ఇండియా, చైనాల్లో ఆదాయ అసమానతలు క్రమంగా పెరిగాయని విశ్లేషించారు. 1980ల్లో ధనికుల ఆదాయం 30శాతం, 2019లో 56శాతం వృద్ధి అయింది. కులమత వివక్షల కారణంగా భారతదేశంలో ఆదాయ అసమానతలు పెరుగుతున్నాయని నిర్ధారించారు. మన దేశంలో 22.3శాతం హిందువుల వద్ద 47శాతం దేశ సంపద ఉందని, 7.8శాతం ఉన్న హిందూ యస్‌టీ వర్గం వద్ద 3.7శాతం సంపద మాత్రమే ఉందని తేలింది. మహారాష్ట్ర, యూపీ, కేరళ, తమిళనాడు, హర్యానా రాష్ట్రాల్లోనే 50శాతం వరకు సంపద దాగి ఉందని అంచనా.

ఆదాయ అసమానతల కారణంగా నిరుద్యోగం, అతి తక్కువ వేతనాలతో పనులు లాంటివి ఏర్పడతాయి. అర్హతకు తగిన ఉద్యోగం లభిస్తేనే ఆదాయాలు పెరుగుతూ, అసమానతలు తగ్గుతూ, క్రియాశీలతలు/ఉత్పత్తులు/సాఫల్యతలు పెరుగుతాయి. శ్రమ దోపిడీతో ఆదాయాలు, నిరుపేదల శరీరాలు కుంచించుకు పోవడం చూస్తున్నాం. పేదరికం, నిరుద్యోగం, అసమానతలు విడదీయరాని సంబంధాన్ని కలిగి ఉంటాయి. ఉద్యోగాల కల్పన, పనికి తగ్గ వేతనాలు దొరికితేనే ఆదాయాలు పెరుగుతాయి. పారిశ్రామిక, వ్యవసాయ లాభాలు, ఆదాయాలు తగ్గితే శ్రామికులు/దినసరి కూలీలకు ఆదాయాల్లో భారీ కోతలు విధిస్తారు. ఒకవేళ లాభాలు పెరిగినా ఉద్యోగులు/శ్రామికవర్గాల వేతనాలు పెరగడంలేదు. కుబేరులు ఆదాయాలకు తగిన పన్నులు కట్టకుండా, దొడ్డి దారిన పన్నులను ఎగవేయడం పరిపాటిగా కనిపించడంతో ప్రభుత్వ ఆదాయాలకు గండి పడడం, పేదలకు అభివృద్ధి ఫలాలు అందకపోవడం జరుగుతోంది.

రాజ్యాంగం ప్రసాదించిన సామాజిక సమానత్వం, సమాన అవకాశాల కల్పన, సంపద సమానంగా పంపిణీ కావడం లాంటి హక్కులు నేటికీ కాగితాల్లోనే దాగి ఉన్నాయి. ప్రాంతీయ అసమానతలతో పాటు అవకాశాల్లో అసమానతలు దేశ సమాఖ్య స్ఫూర్తి పునాదులను బలహీనపరుస్తున్నాయి. ప్రభుత్వాలు సామాజిక, ఆర్థిక సమానత్వ సాధనకు భూసంస్కరణలు, సామాజిక భద్రత, పెన్షన్లు, నైపుణ్య శిక్షణల వంటి తగు పటిష్ట చర్యలను తీసుకోవాలి. అత్యంత కుబేరులకు రాయితీల రూపంలో కొమ్ముకాయకుండా, వారి సంపద నుంచి అధిక అనువంశిక పన్నులను విధించాలి. పారిశ్రామిక, ఔత్సాహిక వర్గాలను చేయూతను ఇవ్వడం, పన్నుల వసూళ్లను అమలు పరచడం జరగాలి. అదాని, అంబానీ లాంటి పారిశ్రామిక కుబేరుల చేతుల్లో ప్రభుత్వాలు కీలు బొమ్మలు కావడం అసమానతల పోషణకు ఆజ్యం పోస్తూనే ఆదాయాలు పెంచుకోవడం, వ్యయాలు తగ్గించుకోవడం, లాభాలు పొందడం సంపన్నులకు సర్వసాధారణం అవుతున్నది.

డా. బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037

మార్కెట్ సునామీకి వనామీ రైతు విలవిల

ఎం. కోటేశ్వరరావు

దేశంలో దాదాపు రెండు లక్షల 70వేల ఎకరాల్లో వనామీ రకం రొయ్యల సాగు జరుగుతోంది. దీనిలో లక్షా 80వేల ఎకరాలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంది. టైగర్ రొయ్యల రకం మరొక లక్షా 50వేల ఎకరాల్లో జరుగుతోంది. ఇది ప్రధానంగా లక్షా పాతికవేల ఎకరాలు ఒక్క పశ్చిమ బెంగాల్లోనే జరుగుతోంది. ప్రస్తుతం తమ పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని వనామీ రైతులు వాపోతున్నారు. వివిధ కారణాలతో ప్రపంచంలో రొయ్యల ఎగుమతి మార్కెట్ అవకాశాలు తగ్గాయి. ఒక వైపు మేత ధరలు విపరీతంగా పెరగటం మరొక వైపు కొనే వారు లేక చేతికి వచ్చిన వాటిని తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి. రానున్న కొద్ది నెలలు కూడా ఇలాగే కొనసాగితే ఈ రంగం మొత్తం తీవ్ర సంక్షోభంలో పడనుంది. ఒక అంచనా ప్రకారం ఇప్పటికే రు.25వేల కోట్ల మేరకు నష్టపోయి నట్లు అంచనా. రొయ్యలను శుద్ధి చేసి ఎగుమతికి అనువుగా తయారు చేసే ఫ్యాక్టరీలలోచిన్నా, మధ్యతరగతివి మూసివేతకు దగ్గరగా ఉన్నట్లు చెబుతున్నారు. ఎగుమతులు లేవనే పేరుతో కొందరు రైతులకు చెల్లించాల్సిన సొమ్మును సకాలంలో ముట్టచెప్పటం లేదు.

అమెరికా, ఐరోపా, జపాన్ దేశాలలో క్రిస్మస్ సందర్భంగా పలు ఉత్పత్తులకు డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం తలెత్తిన ఆర్థిక ఒడిదుడుకుల కారణంగా ఈ ఏడాది దానికి తగిన విధంగా మన దేశం నుంచి దిగుమతి ఆర్డర్లు లేవు. చైనాలో కరోనా కేసులను సున్నాకు తగ్గించాలని అక్కడి ప్రభుత్వం లాక్‌డౌన్లు ఇతర ఆంక్షలను విధించిన కారణంగా అక్కడి డిమాండ్ కూడా తగ్గినట్లు వార్తలు. ఆగస్టు నెల నుంచి ఎగుమతి డిమాండ్ తగ్గిన కారణంగా ఆంధ్రప్రదేశ్ రొయ్యల మార్కెట్ సంక్షోభం మొదలైంది. విదేశాల్లో డిమాండ్ తగ్గటంతో ధరలు కూడా పడిపోయాయి. 2021-22లో మన దేశం నుంచి 7.76 బిలియన్ డాలర్ల మేర సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు జరగ్గా కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది లక్ష్యంగా 8.6బి.డాలర్లను నిర్ణయించింది. అది నెరవేరే పరిస్థితి కనిపించటం లేదు. గిరాకీ తగ్గుదల 30 నుంచి 35శాతం వరకు ధరల పతనం 20 నుంచి 25శాతం ఉన్నందున జనవరి తరువాత తిరిగి పూర్వపు స్థాయికి చేరితే తప్ప అటు కేంద్ర ప్రభుత్వానికి విదేశీ మారకద్రవ్యం తగ్గుదల ఇటు రైతాంగానికి ఆర్థిక నష్టం జరుగుతుంది. ఎగుమతి-దిగుమతి దేశాలన్నింటా శీతల గిడ్డంగులన్నీ ఆక్వా ఉత్పత్తులతో నిండి ఉన్నట్లు వార్తలు. ఈ కారణంగానే కొనుగోళ్లు మందగింపు, పరిస్థితి మెరుగుపడకపోదా అనే ఆశ ఉన్న ఎగుమతిదార్లు రైతుల నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారు. మెరుగుపడితే మంచి లాభాలు లేకపోతే నష్టం ఉండదు అన్న అంచనాలే దీనికి కారణం. గతంలో కూడా మార్కెట్లో కొన్నిఇబ్బందులు తలెత్తినా ఇలాంటితీవ్రత గడచిన నాలుగు దశాబ్దాల్లో ఎన్నడూ లేదని ఆ రంగంలోని ప్రముఖులు చెబుతున్నారు. ధనిక దేశాల్లో

తలెత్తిన ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల కారణంగా జేబులకు చిల్లుపడు తున్నందున జనం తమ అలవాట్లు, అవసరాల ప్రాధాన్యతలను కూడా మార్చు కుంటారు. అత్యవసరమైన వాటినే కొనుగోలు చేస్తారు. ఈ పరిస్థితికి తోడు గతేడాది ప్రపంచంలో 40 లక్షల టన్నుల మేర రొయ్యల ఉత్పత్తి జరిగితే ఈ ఏడాది 50 లక్షల టన్నుల వరకు ఉండవచ్చని అంచనా. ఇది కూడా ధరల పతనానికి ఒక కారణం అంటున్నారు. ఈక్వెడార్, ఇండోనేషియా, వియత్నాంలో ఉత్పత్తి పెరిగింది. పన్నెండు లక్షల టన్నులతో ఈక్వెడార్ ఇప్పుడు ప్రపంచంలో అగ్రదేశంగా ఎదిగింది. చమురు ధరల పెరుగుదలతో రవాణా ఖర్చు పెరిగింది. మన దేశం నుంచి అమెరికా, తరువాత స్థానాల్లో చైనా ఎక్కువగా దిగుమతులు చేసుకుంటున్నాయి. రవాణా ఖర్చుల పెరుగుదల కారణంగా పక్కనే ఉన్న ఈక్వెడార్ నుంచి దిగుమతి చేసుకోవటం అమెరికాలోని దిగుమతి కంపెనీలకు ఎక్కువ లాభం కనుక అక్కడి ఉత్పత్తులకు మొగ్గు చూపుతున్నారు. చైనా కూడా అక్కడి నుంచి కొంత దిగుమతి చేసుకుంటున్నది.

మన కరెన్సీ విలువ తగ్గినందున ఎగుమతిదార్లకు పెరిగిన రవాణా ఖర్చు కలసి వచ్చి కొనుగోలు చేస్తారని భావిస్తే అమెరికా మినహా మిగిలిన దిగుమతి చేసుకొనే దేశాల కరెన్సీ విలువలు కూడా మన రూపాయి మాదిరి పతనమై ఆ దేశాలలో కొనుగోలు శక్తి తగ్గింది. ఆంధ్రప్రదేశ్‌లో కిలోకు వంద తూగే వనామీ రకం రొయ్యలకు కనీసం రు.240 చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది, ఎవరూ కొనుగోలుకు ముందుకు రాకపోవటంతో దాన్ని రు.210కి తగ్గించినా చిత్తశుద్ధితో అమలు జరిపేవారు లేరు. నిల్వ ఉండే సరకు కానందున చివరకు రు.180, ఇంకా అంతకు తక్కువకు సైతం అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఉత్పత్తి ఖర్చులు కూడా రాక ఆర్థికంగా నష్టపోతున్నారు. చివరకు టైగర్ రకం ధర కూడా రు.600 నుంచి 450కి పడిపోయింది. ఈ కారణంగా గతేడాది జరిగిన 9.2లక్షల టన్నుల ఉత్పత్తి ఈ ఏడాది ఎనిమిది లేదా ఇంకా తక్కువకు పడిపోవచ్చని అంచనా వేస్తున్నారు. ఇతర దేశాల రైతులకు సైతం ఎగుమతి అవరోధాలు ఉన్నప్పటికీ మలేషియా, వియత్నాం, థాయిలాండ్ వంటి దేశాల్లో వంద కౌంట్ ఉన్న వాటికి రు.290 నుంచి 310 వరకు రైతుకు వస్తుండగా మన దగ్గర రెండువందలకంటే తక్కువకు దిగజారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కిలోకు రు.300 లకు తగ్గితే గిట్టుబాటు కాదని, 270 కంటే తగ్గితే నష్టమని అంటున్నారు.

మనదేశం 123దేశాలకు సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నది. వీటిలో ఎక్కువ భాగం రొయ్యలే ఉండటంతో గతేడాది జరిగిన మొత్తం ఆరులక్షల టన్నుల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ వాటా 60శాతం వరకు ఉంది. చైనా తన దిగుమతుల్లో 70శాతం మన దేశం నుంచి చేసుకొనేది ఇప్పుడు ఈక్వెడార్ నుంచి కూడా చేసుకుంటున్నది. వివిధ దేశాలు చేసుకొనే దిగుమతులపై వర్తమాన రాజకీయాలు, వాణిజ్య సంబంధాలు కూడా ప్రభావం చూపుతాయి. తమకు వ్యతిరేకంగా పని చేస్తున్న అమెరికాతో భారత్ చేతులు కలుపుతోందన్న అభిప్రాయం చైనాకుఉంది. మరోవైపున మనదేశంలో బిజెపి, దానికి మార్గ దర్శకంగా పనిచేసే సంఘపరివార్ సంస్థల దళాలు, వారికి వంతపాడే మీడియా విశ్లేషకులు సుప్రభాతం మాదిరి రోజు చైనా ఉత్పత్తులను బహిష్కరించాలని, ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకొని దానికి బుద్ది చెప్పాలని, మన కాళ్ల దగ్గరకు తెచ్చుకోవాలని ప్రచారం చేస్తుంటారు. ఈ నోటి దూలను చూసిన తరువాత మన ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా ఎగుమతి చేసే దేశాలున్నపుడు వాటి నుంచి దిగుమతులు చేసుకోవాలనే ఆలోచన కలగవచ్చు. లేకపోతే ఎంతో దూరంలో ఉన్న ఈక్వెడార్ నుంచి చైనా దిగుమతులు చేసుకోవాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చినట్లు ? వాటికి ప్రతిగా చైనాకు తన వస్తువులను అక్కడికి ఎగుమతి చేసేందుకు అవకాశాలు పెరుగుతాయి. మన ప్రభుత్వం విధిస్తున్న ఎగుమతి పన్నులు, మన దేశంతో ఒప్పందాలు లేని కారణంగా దిగుమతి చేసే దేశాలు మన ఉత్పత్తులపై విధిస్తున్న పన్నులు కూడా దిగుమతిదార్లను అవి లేని దేశాల వైపుకు నెడతాయి. అందువలన ఇలాంటి పన్నులు లేకుండా ఉండాలంటే మనదేశం ఇతరదేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవటం కూడా అవసరమే. అయితే అలాంటి ఒప్పందాలకు వెళ్లే ముందు మన దేశ లబ్దిని కూడా చూసుకోవాల్సి ఉంటుంది. ఐరోపా, ఇతర దేశాలతో వియత్నాం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నందున అవి మనకు బదులు అక్కడి నుంచి దిగుమతి చేసుకుంటాయి. మనరొయ్యలపై తెల్లమచ్చల కారణంగా ఆస్ట్రేలియా దిగుమతులను నిలిపివేసింది. అందువలన ఎగుమతి చేసే దేశాలు కోరుకున్న ప్రమాణాల మేరకు వ్యాధులు, నిషేధిత మందుల అవశేషాలు లేకుండా మన ఉత్పత్తులుండటం కూడా అవసరమే. ఒక వేళ ఇక్కడ కన్ను గప్పి పంపినా ఎక్కడైనా పట్టుబడితే మొదటికే మోసం వస్తుంది.

సజీవుల్ని 'మమ్మీ'లుగా మార్చింది ఈ దేశంలోనే

డాక్టర్ దేవరాజు మహారాజు

ప్రాచీన ఈజిప్టు సంస్కృతిలో జాతకాల్ని బలంగా విశ్వసించడం ఉంది. మరణానంతర జీవితం ఉంటుందని కూడా వారి ప్రగాఢ విశ్వాసం. అందుకే చనిపోయిన వారి శరీరాల్ని మమ్మీలుగా భద్ర పరచాలని, ఆత్మలకు ఆశ్రయ కల్పించాలని ప్రయత్నించారు. ప్రాణికి, ఆత్మకు వారు రెండు వేరువేరు మాటలు వాడారు. శరీరంలోని ప్రాణాన్ని 'క' అని అన్నారు. ఆత్మను 'బా' అని అన్నారు. మనిషి చనిపోయినప్పుడు వెళ్లిపోయేది ప్రాణశక్తి (క). ఇది కాక, ప్రతిమనిషికి 'బా' (ఆత్మ) వేరుగా ఉంటుంది. ఇది కదులుతుంది. క-ను వదిలిపెట్టి పోతుంది. కానీ ప్రతిరోజు రాత్రి క-ను వెతుక్కుంటూ వచ్చి అందులో చేరుతుంది. అని వారి నమ్మకం! చనిపోయినప్పుడు అంత్యక్రియలు జరపడం ఎందుకంటే..క-ను వదిలి, బా-స్వేచ్ఛగా వెళ్లడానికీ, మళ్లీ వచ్చి అందులో చేరడానికీ వెసులుబాటు కల్పించడమన్న మాట! అందువల్ల చనిపోయిన వారి శరీరాల్ని జాగ్రత్తగా భద్రపరచాలన్న ఆలోచన వారికి వచ్చింది. అందుకోసమే శవాలకు గుడ్డ చుట్టి మమ్మీలుగా చేసి సిద్ధంగా ఉంచుతారు. అలా మమ్మీలు తయారయ్యాయి. మళ్లీవాటిని భద్రపరచడానికి పిరమిడ్లు తయార య్యాయి. శరీరాలు, ఆత్మలు,జన్మ, పునర్జన్మల గురించి వారి ఆలోచనలు ఎలా ఉన్నా, రసాయనాలు పూసి, మరణించిన వారి శరీరాల్ని దీర్ఘకాలంపాటు భద్ర పరచడం వారికి ఎలా సాధ్యమైందో ఆధునిక సాంకేతిక పరికరాలేవీ లేనికాలంలో అంత పెద్దపిరమిడ్లు, అంత ఎత్తుగా ఎలా కట్టగలిగారో ఆలోచిస్తే ఆశ్చర్యంగా ఉంటుంది.

శరీరంవేరు, ఆత్మవేరు. మరణానంతరం శరీరంకదలదు. కానీ ఆత్మ కదులు తుంది. స్వేచ్ఛగా తిరుగుతుంది. అనే భావనను ఇక్కడి సనాతనులు ఈజిప్టు సంస్కృతి నుంచి తీసుకున్నదేనని అనిపిస్తుంది. ఇక్కడ జంతువుల్ని దేవుళ్లుగా కొలిచే ఆచారం కూడా అక్కడి నుంచి వచ్చిందే అయి ఉంటుంది. వారి ఓపెట్ ఫెస్టివల్ వలెనే ఇక్కడి వైదిక ధర్మ ప్రబోధకులు దేవుడి సేవపేరుతో, దేవతా విగ్రహాల్ని ఊరేగించారు. అక్కడ వారు మాట్ అన్నదాన్నే ఇక్కడ వీళ్లు మతంగా మార్చుకున్నారేమో తెలియదు. పోలికలైతే ఉన్నాయి. ఒసిరిస్‌ను శవపేటికలో ఉంచి అతని సోదరుడు సేత్ నైలు నదిలో పడేసిన ఘట్టాన్ని కొంత మార్చి ఇక్కడ పురాణాల్లో వాడుకున్నారు. పెళ్లికిముందే మహాభారతంలో కుంతీకుమారి కొడుకుని కని పెట్టెలో పెట్టి గంగానదిలో వదిలేయడం మనకు చప్పున గుర్తుకొస్తుంది.

ఈజిప్టు సంస్కృతి ప్రకారం మరణించిన ప్రతి వ్యక్తిని మాట్ దేవత ఒక విశాలమైన సత్యపు హాలులోకి ఆహ్వానిస్తుంది. ఆమె చేతిలో తెల్లని సత్యపు ఈక ఉంటుంది. అక్కడ మరణించిన వారి దేవుడు తన తీర్పు వినిపిస్తాడు. బహుశా డ్యూయెట్ అనేది ఇదేనేమో-మంచి చెడులను బేరీజువేసి తుది తీర్పువెలువడే చోటు. చనిపోయిన వ్యక్తి 'హృదయభారాన్ని' అక్కడ తూకం వేస్తారు. ఎందుకంటే హృదయ భారతమే చనిపోయిన వ్యక్తి జ్ఞాన సంపదను తెలియజేస్తుందని ఈజిప్టు వారి నమ్మకం. దాని ద్వారానే అతను జీవించి ఉన్నప్పుడు చేసిన మంచి పనుల్ని, చెడు పనుల్ని లెక్కగడతారు. మాట్ నిబంధనల ప్రకారం అతను ఎటు వెళ్లాలన్నది నిర్ణయిస్తారు.

1.రా-వెంట ప్రయాణించే అవకాశం లభిస్తుంది. లేదా 2. దిగువలోకంలోకి తోసేయొచ్చు. అదీకాకపోతే 3.మళ్లీ మానవ జన్మఎత్తి లేదా మరో జీవిగా జన్మించి మామూలు జీవితం గడపొచ్చు. ఇక్కడి విశ్వాసాల ప్రకారం నరకంలో యమధర్మరాజు సన్నిధిలో చిత్రగుప్తుడి చిట్టాలో పాప-పుణ్యాల లెక్కచూసి, శిక్షలు విధిస్తారని వైదిక ధర్మం చెపుతుంది. చిన్నపాటి తేడాలున్నా పద్ధతి అంతా ఒకటిగానే ఉంది కదా! పరీక్ష హాల్లో ముదు వాణ్ణి చూసి కాపీకొట్టేవాడు ఏదో కొంచెం అటూఇటూగా రాస్తాడు కదా? ఇదీ అంతే!

ఇక ఈజిప్టు సంస్కృతిలోని దేవాలయాల గురించి చూద్దాం! దేవీ దేవతల భౌతిక ఆకారాలు తయారుచేసి, ఒక ఇంట్లో పెట్టి పూజించేచోటును అక్కడ 'దేవాలయాలు' అని పిలుచుకున్నారు. ఇవి రెండురకాలుగా ఉండేవి. ఒకటి- దేవతామూర్తుల ఆలయాలు. రెండు-చనిపోయిన వారి పరిపాలకులు/ఫరా/రాజుల ఆలయాలు. ఎందుకంటే అక్కడి ప్రజలకు ఫరా అంటే దేవుడితో సమానం! దేవాలయాల్లో మొదట ప్రభుత్వ అధికారులే పూజలు నిర్వహించే వారు. తర్వాతికాలంలో వృత్తిరీత్యా పూజారుల్ని నియమించారు. క్రమంగా అది వారసత్వ వృత్తి అయిపోయింది. ఫరానే కాకుండా ఎద్దు, పిల్లి, మొసలి వంటి జంతువుల్ని కూడా అక్కడి ప్రజలు పూజించే వారు. టహ్ అనే దేవుడి ప్రతిరూపమే ఎపిస్ బుల్ కాబట్టి, దాన్ని పూజించేవారు. అలాగే పిల్లులు, మొసళ్లు ఇంకా కొన్ని ఇతర జంతువులను మమ్మీలుగా మార్చుకుని పూజించేవారు. విశ్వాసాల ఆధారంగా ఈజిప్టు ప్రజలు కొన్ని పండగలు, వేడుకలు జరుపుకునేవారు. కార్నాక్ ప్రాంతంలో జరిగే ఓపెట్ ఫెస్టివల్ అలాంటిదే. అందులో ప్రధానంగా దేవుళ్ల ప్రతిమల్ని ఊరేగించేవారు. ఆ ఊరేగింపులో ఎవరైనా న్యాయబద్ధమైన ప్రశ్నలు లేవదీస్తే, వాటికి అక్కడే పరిష్కారం దొరికేది. అంటే ఊరేగింపులో ఉన్న ఆ భగవంతుడి అనుగ్రహంతో మంచి సూచనలు,సలహాలు,పరిష్కారాలు లభిస్తాయని ప్రజలు భావించేవారు. ఎందుకోగాని,ఈ అంశాన్నిఈ దేశంలోని మనువాదులు స్వీకరించ లేదు. జవాబు ఇవ్వడమైనా,పరిష్కారాలు చూపడమైనా వారితో అయ్యేపనికాదని వారుగ్రహించి ఉంటారు. ఎంతైనా తెలివిగల వాళ్లుకదా? ఊరేగింపులోని దేవుడి ప్రతిమ కిందనుండి భక్తులు ఇటునుండి అటు, అటు నుండి ఇటునడిచి వెళ్లేవారు. ఆ దేవుడి పట్ల తమ భక్తి ప్రపత్తులను అలా చాటుకునేవారు. ఆ దేవుడి దయ లభించి, తమ కుటుంబాలు చల్లగా వర్ధిల్లుతాయని వారి నమ్మకం. తమ కోర్కెల్ని ఆ దేవుడు తప్పక తీరుస్తాడని వారి ఆశాభావం. దాన్ని ఉన్నది ఉన్నట్లుగా ఇక్కడి వైదిక ధర్మం స్వీకరించింది. జనానికి బోధించింది. అందుకే ఇక్కడ కూడా దేవుడిసేవ కింది నుండి భక్తులు ఇటు నుండి అటు, అటు నుండి ఇటూ తిరిగి, తమ భక్తిని చాటుకుంటారు. తమ కోర్కెలు తీరాలని కోరుకుంటారు. ఈజిప్టు సంస్కృతిలో నైలునది వరదలగూర్చి కూడా కొన్ని నమ్మకాలున్నాయి.

ప్రతి సంవత్సరం నైలునదికి వచ్చే ఉధృతమైన వరదల వల్ల ప్రపంచం ఎప్పటికప్పుడు తొలిదశకు చేరుకుంటుందనీ, మళ్లీ ఆ 'దేవుడిదయ'తోనే తాము ప్రపంచాన్ని యధాస్థితికి మార్చుకుంటామని ప్రాచీన ఈజిప్టు ప్రజలు విశ్వసించే వారు. నైలునదికి వచ్చే వరదలవల్ల దాని పరివాహక ప్రాంతంలో ఉన్న పంట పొలాలన్నీ ఊడ్చుకుపోయేవి. సరిహద్దులన్నీ కొట్టుకుపోయేవి. ఎవరి భూమి ఏదో అంతు చిక్కేదికాదు. క్రమంగాసమాజం కొంతఆధునికతవైపు అడుగిడుతున్న సమయంలో తత్త్వవేత్త, గణిత శాస్త్రజ్ఞుడు పైథాగరస్ (750-495 బీసీ) ప్రజలకు ఒక గణితసూత్రాన్ని అందించాడు. అదే తర్వాతికాలంలో 'పైథాగరస్ సిద్ధాంత'మైంది. దానిప్రకారం, ఆనాటిరైతులు ఎవరి భూమిని వారు కొలుచుకుని, మళ్లీ సాగు చేసుకునేవారు. 'దేవుడిదయ' అనేది కేవలం వారివిశ్వాసం మాత్రమే కానీ, వాస్తవంగా ఉపయోగపడింది ఒక జ్ఞాని. అతని ఆలోచనల్లోంచి వచ్చిన ఉపయోగ కరమైనొక గణిత సిద్ధాంతం!! విచిత్రం అక్కడి విశ్వాసాలనే కాదు, కాలక్రమంలో గ్రీసు, ఈజిప్టుల నుండి వచ్చిన గణిత సూత్రాలని కూడా మనువాదులు ఇక్కడ నేర్చుకోక తప్పలేదు. పైథాగరస్ సిద్ధాంతం ఇప్పటికీ క్షేత్రగణితంలో అతి ముఖ్యమైందని మన స్కూలు పిల్లలకి కూడా తెలుసు. మమ్మీలుగా మార్చే విధానాన్ని మమ్మిఫికేషన్ అని అంటారు. దీనికి సుమారు 75రోజులు పట్టేది. మమ్మీలుగా చేయడానికి ప్రత్యేకమైన నిపుణులుండేవారు. వారికి మానవ శరీర నిర్మాణంపై కొంత అవగాహన ఉండేది.మృతదేహం పొట్టచీల్చి, లోపలి అవయవాలన్నీ తీసి వేరేపెట్టెలో పెట్టేవారు. వాటిని కానోపిక్ జార్స్ అని అంటారు. అవి కూడా మమ్మీల పక్కనే సమాధుల్లో పెట్టేవారు. అయితే శరీరంలో ఎడమవైపున ఉండే హృదయాన్ని కదిలించకుండా అలాగే ఉంచేవారు. ఎందుకంటే చినపోయిన మనిషి జ్ఞానమంతా అందులోనే ఉంటుందని వారి భావన. అప్పటికి ఇంకా వారికి మెదడు చేసే పనేమిటో, హృదయం చేసే పనేమిటో తెలియదు. జ్ఞానానికి కారణమైన మెదడును ముక్కలు ముక్కలుగా బయటికి తీసి, హృదయాన్ని మాత్రం అలా ఉంచేసేవారు. ముక్కులోనుండి ఒక పరికరం పైకి పొడిచి, మెదడు తీసేవారు. శరీరమంతా డొల్లగా చేసిన తర్వాత అందులో నాట్రాన్ అనే ఉప్పు పాకెట్లు వేసి తేమను లాగేసేవారు. బాగా ఆరి పోయాక ఉప్పు తీసేసి శరీరం శుభ్రంగా కడిగేవారు. ఆ తర్వాత లెనిన్ గుడ్డ మీద వారి ప్రార్థనల చరణాలు రాసి, దాన్ని శరీర భాగాలకు విడివిడిగా చుట్టేవారు. ఈ ప్రక్రియలో భాగంగా గోరువెచ్చని రెసిన్ శరీరానికి పూసేవారు. ఇక్కడ ఈ పనులు జరుగుతూ ఉండగా మరోవైపు సమాధి తయారయ్యేది. పనివాళ్లు, మేస్త్రీలు, కళాకారులు ఎవరి పనులు వాళ్లు చేస్తుండేవారు. ఊరికే మట్టిలో పూడ్చేయడం కాకుండా, చనిపోయిన వ్యక్తి మరణానంతర జీవితం జీవించడానికి ఫర్నిచర్ సహా సమాధిని కళాత్మకంగా తీర్చిదిద్దేవారు.

మమ్మీలుగా చేయడమనేది చాలా ఖర్చుతో కూడుకున్న పనిగనుక, రాచ కుటుంబీకులు, ధనవంతులు మాత్రమే చేయించుకునేవారు. అలాంటివారి మమ్మీలతో పాటు సమాధుల్లో ఉంచడానికి రాజు(ఫరా) సహా కొందరు పెద్దవాళ్లు బహుమతులు పంపేవారు. గురువును మించిన శిష్యుడిలాగా ఇక్కడి వైదిక సంప్రదాయం-ఈజిప్టును మించి పోయింది. అక్కడ శవాలనుండి తేమను లాగి ఆరబెడితే, ఇక్కడ వీరు మూలవాసుల్ని తిండికి దూరం చేసి ఎండబెట్టారు. అక్కడ శవాలకు మెదడు తొలగిస్తే ఇక్కడ మూలవాసుల మెదడు నిర్వీర్యం చేశారు. దేవుడిపేరుతో భయోత్పాతం సృష్టించారు. ఈ విషయాలు అలా ఉండనిస్తే శవాలకు స్నానాలు చేయించడం, చనిపోయిన వ్యక్తికి ఇష్టమైన వంటకాలుచేసి సమాధుల దగ్గర పెట్టడం, ఇష్టమైన వస్తువులు పెట్టడం ఎందుకో ఇప్పుడు అర్థమైందికదా? మరణానంతర జీవితంలో మృతులు సంతోషంగా సంతృప్తిగా ఉండాలని కోరుకోవడమే. అక్కడ ఈజిప్టులో మృతదేహాల్ని మాత్రమే మమ్మీలుగా మార్చి భద్రపరిచారు. ఇక్కడి వైదిక సంస్కృతి జనాన్ని సజీవంగానే 'మమ్మీ'లుగా మార్చింది. అధిక సంఖ్యాకులైన ఇక్కడి మూలవాసులకు విద్యనివ్వక, స్వేచ్ఛనివ్వక, ఆర్థిక స్వాతంత్ర్యమివ్వక, దేవుడిపేరుతో కుట్రలు పన్ని బానిసలుగా చేసింది. అక్కడ క్రీ.పూ. ఉన్న సంస్కృతిని ఇక్కడి మనువాదులు ఈ వైజ్ఞానిక యుగంలో కూడా ఇంకా కొనసాగించాలని తాపత్రయపడుతున్నారు.

వ్యాస రచయిత సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త

గోద్రా దోషులకు బెయిల్ ఇవ్వొద్దు: గుజరాత్

న్యూఢిల్లీ: గోద్రా రైలు దహనం కేసు దోషులకు బెయిల్ ఇవ్వొద్దని గుజరాత్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది. ఆ దోషులు కేవలం రైలుపై రాళ్లు రువ్విన వారు మాత్రమే కాదని, అగ్నికి ఆహుతైన రైలు బోగీ నుంచి ప్రజలు బయటకు రాకుండా అడ్డుకున్నారని తెలిపింది. బోగీ నుంచి బయటికి వస్తే కొంతమందైనా ప్రాణాలు కాపాడుకునే వారని చెప్పింది. 2002 ఫిబ్రవరి 27న గుజరాత్‌లోని గోద్రా వద్ద సబర్మతి ఎక్స్‌ప్రెస్ ఎస్-6 బోగీ అగ్నికి ఆహుతై 59 మంది సజీవదహనమైన విషయం విదితమే. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం ఈ కేసును విచారించింది. దోషులను రాళ్లదాడికి పాల్పడిన వారిగా పరిగణించాలని, అయినా వారు ఇప్పటికే 17-18 ఏళ్లు జైలు శిక్ష అనుభవించారని ధర్మాసనం గుర్తుచేసింది. గుజరాత్ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ...దహనమవుతున్న రైలు నుంచి తప్పించుకోవడానికి వీలు లేకుండా దోషులు రాళ్ల వర్షం కురిపించారని చెప్పారు. దీనిని కేవలం రాళ్ల దాడిగానే పరిగణించవద్దని విన్నవించారు. గుజరాత్ హైకోర్టు 2017 నాటి తీర్పుకు వ్యతిరేకంగా దోషులు సుప్రీంకోర్టును ఆశ్రయించారని, విచారణ కోసం దీనిని లిస్టు చేయాలని మెహతా కోరారు. నిందితుల వ్యక్తిగత పాత్రపై విచారణ జరపాలని విన్నవించారు. కేసు తదుపరి విచారణను డిసెంబరు 15కు ధర్మాసనం వాయిదా వేసింది.

గవర్నర్ల నియామకానికి ప్రమాణాలు ఉండాలి ఉద్ధవ్ డిమాండ్

ముంబై: రాష్ట్ర గవర్నర్ల పదవికి వ్యక్తుల ఎంపికకు కొన్ని ప్రమాణాలను తప్పనిసరిగా నిర్ణయించాలని శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే) అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే శనివారం డిమాండ్ చేశారు. మహారాష్ట్ర గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీ ఛత్రపతి శివాజీ మహారాజ్, సంఘ సంస్కర్తలు జ్యోతిబా పూలే, సావిత్రీబాయి పూలే వంటి గౌరవనీయ వ్యక్తులను అవమానిస్తున్నారని థాకరే అన్నారు. ఒక రాష్ట్ర మంత్రి ఏకనాథ్ షిండే ద్రోహాన్ని (జూన్‌లో ఎంవీఏ ప్రభుత్వాన్ని పడగొట్టిన తిరుగుబాటు) యోధ రాజు ఆగ్రా నుంచి తప్పించుకోవడంతో పోల్చారు. 'అలాంటి వ్యక్తులు పదవిలో కొనసాగుతూనే ఉన్నారు' అని ఆయన తెలిపారు. 'గవర్నర్ భారత రాష్ట్రపతికి ప్రతినిధి, అటువంటి పదవికి ఎవరిని నియమించాలనే దానిపై కొన్ని ప్రమాణాలు ఉండాలి. అటువంటి నిబంధనలను రూపొందించాలని నేను డిమాండ్ చేస్తున్నాను' అని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రాన్ని, దాని చిహ్నాలను అవమానించే వారికి వ్యతిరేకంగా చేతులు కలపాలని ప్రజలకు తన విజ్ఞప్తిని పునరుద్ఘాటించారు. మహారాష్ట్ర-కర్ణాటక మధ్య సరిహద్దు వివాదంపై థాకరే మాట్లాడుతూ 'రాబోయే రోజుల్లో మేము ఒక కార్యక్రమాన్ని ప్రకటిస్తాము. మేము కేవలం మహారాష్ట్ర బంద్ (షట్‌డౌన్)కే పరిమితం కాకూడదనుకుంటున్నాము. ఇక్కడి మంత్రులను బెల్గాంకు ఆహ్వానించడం లేదని ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై చేసిన ప్రకటన పై ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే మౌనంగా ఉన్నారని అన్నారు. మహారాష్ట్ర మంత్రులు చంద్రకాంత్ పాటిల్, శంభురాజ్ దేశాయ్ వచ్చే వారం బెలగావికి వెళ్లడం మంచిది కాదని బొమ్మై శుక్రవారం మినహాయింపు ఇచ్చారు. బెల్గాం, కర్ణాటకలోని ఇతర మరాఠీ మాట్లాడే ప్రాంతాలను మహారాష్ట్రలోకి తీసుకురావాలని కామాఖ్య దేవిని ప్రార్థించడానికి షిండే, అతని ఎమ్మెల్యేలు గువహటి (అసోం) వెళ్లి ఉండాల్సిందని థాకరే అన్నారు. ముంబైలోని ఆరే కాలనీలో మెట్రో రైలు కార్‌షెడ్ నిర్మాణంపై ఏకనాథ్ షిండే-దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ... కంజుర్‌మార్గ్‌లో ఈ సదుపాయం వచ్చి ఉండవచ్చని అన్నారు. 'కానీ రాష్ట్ర ప్రభుత్వ వైఖరి పర్యావరణ నష్టాన్ని భరించి తన అహాన్ని కాపాడుకోవడమే' అని ఆయన తెలిపారు. తమ పార్టీ చీలిపోలేదని, రోజురోజుకూ బలంగా పెరుగుతోందని థాకరే అన్నారు.

చరిత్రకారుడు సురేంద్ర గోపాల్ కన్నుమూత

పాట్నా: ప్రముఖ చరిత్రకారుడు, కవి సురేంద్ర గోపాల్(86) పాట్నాలోని ఆసత్రిలో మృతి చెందినట్టు శనివారం కుటుంబ సభ్యులు తెలిపారు. '19వ దశకంలో పాట్నా' పుస్తకంద్వారా గోపాల్ అందరికీ సుపరిచితులు. 'ఆయన శనివారం ఉదయం మరణించారు. ఆయన లేనిలోటు మాకు ఎప్పటికీ తీరదు' అని ఆయన కుమారుడు పీయూష్ తెలిపారు. గోపాల్ చారిత్రత్మక పాట్నా కళాశాల పూర్వ విద్యార్థి. అక్కడ ఆయన ప్రొఫెసర్‌గా కూడా పనిచేశారు. ఆయన 'మ్యాపింగ్ బీహార్: ఫ్రమ్ మెడీవల్ టు మోడర్న్ టైమ్స్', 'బోర్న్ టు ట్రేడ్: ఇండియన్ బిజినెస్ కమ్యూనిటీస్ ఇన్ మెడీవల్ అండ్ ఎర్లీ మోడరన్ యురేషియా' కూడా రచించారు. అనేక పరిశోధనా పత్రాలను కూడా రూపొందించారు. వివిధ ప్రచురణలలో పండిత వ్యాసాలను అందించారు. కుటుంబ స్నేహితుడు తేజకర్ ఝా అతని మరణాన్ని భారీ నష్టమనీ, చరిత్రలోని చివరి దిగ్గజం నిష్క్రమణగా అభివర్ణించారు.

కట్నం తిరిగి ఇచ్చేసిన పెళ్లికొడుకు

ముజఫర్‌నగర్(ఉత్తరప్రదేశ్): అత్తింటి వారు ఇచ్చిన రూ.11 లక్షల కట్నం, బంగారు ఆభరణాలను ఓ పెళ్లికొడుకు తిరిగి ఇచ్చేసి తన సద్బుద్ధిని చాటుకున్నాడు. కట్నానికి బదులుగా రూ.1 తీసుకుంటానని, అది కూడా అత్తమామల ఆత్మసంతృప్తి మేరకని పేర్కొన్నారు. దీంతో అతడిని గ్రామస్తులందరూ పొగుడుతున్నారు. ఈ పెళ్లి ముజఫర్‌నగర్‌లోని తిత్వీ పోలీసుస్టేషన్ ప్రాంతంలోని లఖన్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పెళ్లికొడుకు సురభ్ చౌహాన్ రెవెన్యూ అధికారిగా పనిచేస్తుండగా, పెళ్లి కూతురు పదవీ విరమణ చేసిన ఆర్మీ జవాను కుమార్తె. కిసాన్ మజ్దూర్ సంఘం జాతీయ అధ్యక్షుడు ఠాకూర్ పూరన్ సింగ్ మాట్లాడుతూ ఈ చర్య సమాజంలో మార్పునకు మొదటి అడుగువంటిదని పేర్కొన్నారు. పెళ్లికొడుకు చేసిన పని పదిమందికీ ఆదర్శవంతమని గ్రామస్తుడు అమర్‌పాల్ తెలిపారు.

ఓయోలో 600మందికి ఉద్వాసన



న్యూఢిల్లీ: దేశీయ కంపెనీల్లోనూ ఉద్యోగ కోతలు కొనసాగుతున్నాయి. బైజూస్, జొమాటో వంటి కంపెనీలు ఇప్పటికే ఉద్యోగుల తొలగింపు ప్రక్రియను చేపట్టగా.. తాజాగా ఆతిథ్య సేవలందించే ఓయో సైతం ఉద్యోగుల సంఖ్యను తగ్గించు కుంటున్నట్లు ప్రకటించింది. టెక్నాలజీ, కార్పొరేట్ విభాగానికి చెందిన 600 మంది ఉద్యోగులను తొలగించనుంది. అదే సమయంలో రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ టీమ్‌లోకి కొత్తగా 250 మందిని తీసుకోనున్నట్లు ఓయో తెలిపింది. కంపెనీ సంస్థాగత మార్పుల్లో భాగంగా ఉద్యోగాల సంఖ్య తగ్గించుకునే ప్రక్రియ చేపట్టినట్లు ఓయో పేర్కొంది. ప్రొడక్ట్ అండ్ ఇంజినీరింగ్, కార్పొరేట్ హెడ్‌క్వార్టర్స్, ఓయో వెకేషన్ టీమ్స్‌లో ఉద్యోగుల సంఖ్యను తగ్గించనుం డగా.. రిలేషన్‌షిప్, బిజినెస్ డెవలప్‌మెంట్ టీమ్‌లో కొత్తగా నియామకాలు చేపట్టను న్నట్లు పేర్కొంది. మొత్తం 3,700 మంది ఉద్యోగుల్లో 10 శాతం మేర ఉద్యోగులను తగ్గించు కుంటున్నట్లు కంపెనీ ఓ ప్రకటనలో వెల్లడించింది. 600 మందిని తొలగించి.. కొత్తగా 250 మందిని కొత్తగా నియమించుకుంటున్నట్లు పేర్కొంది. తొలగించిన ఉద్యోగులకు మూడు నెలల పాటు మెడికల్ ఇన్సురెన్స్ కొనసాగుతుందని తెలిపింది. భవిష్యత్‌లో ఆయా విభాగాల్లో నియామకాలు చేపట్టినప్పుడు తొలగించిన ఉద్యోగులకు ప్రాధాన్యం ఇస్తామని కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈఓ రితేశ్ అగర్వాల్ తెలిపారు.

లైంగికదాడి ఆరోపణలపై ప్రొఫెసర్ అరెస్ట్

శ్రీనగర్: తనపై లైంగికదాడి చేశారంటూ జమ్ముకశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాకు చెందిన వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌ను పోలీసులు అరెస్టు చేసినట్లు శనివారం తెలిపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్‌ను శుక్రవారం పొద్దు పోయాక అదుపులోకి తీసుకున్నారు. ఉత్తర కశ్మీర్ జిల్లాలోని షేక్-ఇ-కశ్మీర్ యూని వర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ & టెక్నాలజీ (ఎస్‌కేయుఏఎస్‌టీ) వదుర క్యాంపస్‌లో ఆందోళనలు వెల్లువెత్తడంతో అధికారులు ఆ ప్రొఫెసర్‌ను విధుల నుంచి తొలగించి, ఘటనపై విచారణకు ఆదేశించారు. విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ విస్తరణ, సమాచార విభాగానికి అధిపతిగా ఉన్న వ్యక్తిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. బోమై పోలీసుస్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నారు. ప్రస్తుతం నిందితుడు పోలీసు కస్టడీలోనే ఉన్నారు. నిందితుడిని తక్షణమే సస్పెండ్ చేశామని వర్సిటీ రిజిస్ట్రార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇండోనేసియా తమలపాకులు సీజ్

న్యూఢిల్లీ: ఇండోనేషియాకు చెందిన తమలపాకులను అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తులపై మనీలాండరింగ్ విచారణలో భాగంగా నాగ్‌పూర్, ముంబైలోని ప్రాంగణాల్లో దాడులు నిర్వహించి రూ. 11.5 కోట్ల విలువైన 289 మెట్రిక్ టన్నుల "ఖాతాలో చూపని" తమలపాకులను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శనివారం తెలిపింది. ఈడీ కేసు గత ఏడాది మార్చిలో సీబీఐ ఎఫ్ఐఆర్ నుంచి వచ్చింది. స్థానిక నాగ్‌పూర్‌కు చెందిన అనేక మంది వ్యాపారులు వివిధ ప్రభుత్వ ఉద్యోగుల సానుభూతితో ఇండోనేషియా మూలానికి చెందిన నాణ్యత లేని తమలపాకులు/అరెకా గింజల "స్మగ్లింగ్"కు పాల్పడ్డారని, తప్పుడు క్లయిమ్ చేశారని ఆరోపించారు. ఇందు కోసం నకిలీ సర్టిఫికెట్లను ఉపయోగించారని, తక్కువ విలువైన బిల్లులు / ఇన్‌వాయిస్‌లను ఉపయోగించి కస్టమ్స్ సుంకం ఎగవేతకు పాల్పడ్డారని ఈడీ ప్రకటనలో తెలిపింది. ఇండోనేషియా తమలపాకులు ఎక్కువగా మయన్మార్ సరిహద్దు నుంచి అక్రమంగా రవాణా చేయబడుతున్నాయి. ఇండోనేషియా తమలపాకు సరఫరా దారులు, కమీషన్ ఏజెంట్లు, లాజిస్టిక్ ప్రొవైడర్లు, ట్రాన్స్‌పోర్టర్లు, హవాలా ఆపరేటర్లు, కొనుగోలుదారులు ఈ తమలపాకులను భారత్-మయన్మార్ సరిహద్దు ద్వారా భారత్‌లోకి అక్రమంగా తరలిస్తున్నారని దర్యాప్తులో తేలింది. నాగ్‌పూర్‌లో రూ.16.5 లక్షల నగదుతో పాటు సుమారు రూ.11.5 కోట్ల విలువైన 289.57 మెట్రిక్ టన్నుల లెక్కలోకి రాని తమలపాకులను స్వాధీనం చేసుకున్నట్లు ఏజెన్సీ తెలిపింది.

రాహుల్‌పై పరువు నష్టం కేసు విచారణ వాయిదా

థానె: కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీపై నమోదు చేసిన పరువునష్టం కేసు విచారణను మహారాష్ట్రలోని థానె జిల్లా భివాండీ కోర్టు జనవరి 7వ తేదీకి వాయిదా వేసింది. రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా భారత్ జోడో యాత్ర కొనసాగిస్తున్నందున విచారణకు గాను తనకు మినహాయింపు ఇవ్వాలని రాహుల్ కోరారు. కోర్టు అందుకు అనుమతిస్తూ విచారణను వాయిదా వేసినట్లు భివాండీ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ చెప్పారు. రాహుల్‌పై పరువునష్టం కేసు విచారణ శనివారం జరిగింది. రాహుల్‌గాంధీకి శాశ్వత మినహాయింపు ఇచ్చినట్లు కాంగ్రెస్ తరపు న్యాయవాది నారాయణ చెప్పారు. రాహుల్‌గాంధీపై రాహుల్ కుంటే పరువునష్టం దావా వేశారు.

బహిరంగ జైళ్లతోనే సంస్కరణలు

నిపుణుల ఏకాభిప్రాయం

కోల్‌కతా: జైళ్ల సంస్కరణల అంశం సుదీర్ఘకాలంగా చర్చ జరుగుతోంది. ఆ మేరకు పాలకులు ప్రయత్నిం చాలని నిపుణులు ఎంతోకాలంగా సూచిస్తున్నారు. నేరస్తులను సంస్కరించడం జైళ్ల ప్రధాన లక్ష్యం. కానీ ఇప్పుడు దేశంలో ఉన్న జైళ్లు అందుకు అనుగుణంగా ఉన్నాయా? అనేక కారణాలతో జైళ్లకు వెళుతున్న నేరస్తులు సంస్కరించబడుతున్నారా? లేక మరింత కఠిన తరంగా మారుతున్నారా అంటే...సంస్కరణలకు మన జైళ్లు ఏమాత్రం అనుకూలంగా లేవని నిపుణులు చెబు తున్నారు. జైళ్లను సంస్కరించేందుకు మరిన్ని బహిరంగ జైళ్లు అవసరమని గంట భజాయించి చెబుతున్నారు. సాధారణంగా ఖైదీలు పారిపోకుండా ఎత్తైన గోడలు, విద్యుత్ వైర్లతో కంచె నిర్మాణం, సాయుధ బలగాల మోహరింపుతో మన జైళ్లు నిర్మాణమై ఉన్నాయి. లోపల సదుపాయాలు మాత్రం అంతంత మాత్రమే. ఖైదీలను సంస్కరించేందుకు అనుసరించాల్సిన ఉత్తమ మార్గం మాత్రం బహిరంగ జైళ్లేనని నిపుణులు అంటున్నారు. వీటి వ్యయం చాలా తక్కువని అంటున్నారు. కనీస నియంత్ర ణతో ఖైదీలలో క్రమశిక్షణ తీసుకురావచ్చని, వారి ఇష్టాలకనుగుణంగా స్వతంత్రంగా బతికేందుకు నైపుణ్యత కల్పించడం వంటి చర్యల ద్వారా ఖైదీలతో పెద్దఎత్తున మార్పు తీసుకురావచ్చని పరిశోధకురాలు స్మితా చక్రవర్తి చెప్పారు. ఆమె దశాబ్దకాలంగా భారతదేశంలో జైళ్ల సంస్కృతి పరివర్తనపై అధ్యయనం చేస్తున్నారు. జైపూర్ సంగనర్ ఓపెన్ జైలుపై చక్రవర్తి సుప్రీంకోర్టుకు 2017లో ఓ నివేదిక ఇచ్చారు. దీనిని పరిశీలించిన సుప్రీంకోర్టు...ఈ జైలును అందరూ పరిశీలించాలని చెబుతూ వీలైతే ప్రతి జిల్లాలో ఇలాంటి బహిరంగ జైలు నిర్మాణాలు చేపట్టాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించింది. దేశవ్యాప్తంగా అనేక ప్రాం తాల్లో బహిరంగ జైళ్ల ఏర్పాటు కోసం చక్రవర్తి సుదీర్ఘ కాలంగా కృషి చేస్తున్నారు. ఇందుకోసం అనేక రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేశారు. చట్టానికి వ్యతిరేకంగా తప్పుడు దారిలో నడిచే ప్రజలకు జైళ్లు పునరావాస కేంద్రాలుగా ఉండాలని ఆమె సూచించారు. చక్రవర్తి నివేదిక బయటికి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా 63 ఓపెన్ జైళ్ల నిర్మాణం జరిగింది. అందులో 29 జైళ్లు కేవలం రాజస్తాన్‌లోనే ఏర్పాటు చేశారు. మొత్తంమీద భారత్‌లో నేడు 150 బహిరంగ జైళ్లు ఉన్నాయని ఆమె గర్వంగా చెప్పారు. అయితే వీటి సంఖ్యను ఇంకా పెంచాల్సిన అవసరాన్ని ఆమె నొక్కి చెప్పారు. బీహార్ జైళ్ల గురించి ఆమె ఇటీవల ఓ నివేదిక ప్రచురించింది. ఆ జైళ్లన్నీ ఖైదీలతో నిండిపోయి ఉన్నాయని, ఇరుకు గదులతో ఖైదీలు కూర్చోవడానికి కూడా అవకాశం లేనంతగా ఉన్నాయని ఆమె ఆశ్చర్యం వెలిబుచ్చారు. బీహార్‌లో జైళ్లు అధ్వాన్నం...ఖైదీల జీవితం దుర్భరంగా ఉందని వ్యాఖ్యానించారు. '2014లో రాష్ట్రంలోని మొత్తం 58 జైళ్లను సందర్శించాను. అక్కడ ఉన్న ప్రతి ఖైదీతోనూ మాట్లాడాను. అందులో ఏ కొద్దిమందో నేర ప్రవృత్తితో చిన్నా చితక నేరాలతో జైళ్లకు వచ్చినట్లు తెలుసుకున్నాను. చాలామంది యాధృచ్ఛికంగా జరిగిన నేరాల వల్లే జైళ్లకు వచ్చినట్లు అర్థమైంది. న్యాయ సహాయం అందక... అం దుకు అవసరమైన ఆర్థిక వెసులుబాటు లేక చాలామంది విచారణ కూడా లేకుండా సుదీర్ఘకాలంగా జైలు జీవితం గడుపుతున్నారు. అందులో చాలామందిని మనుషులు గానే గుర్తించడం లేదు' అని చక్రవర్తి వివరించారు. బీహార్ జైళ్లకు సంబంధించి చక్రవర్తి నివేదికపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది. ఇతర రాష్ట్రాల్లోనూ ఇలాంటి తనిఖీలు నిర్వహించాలని సూచించింది. అనేక రాష్ట్రాలు తనను సంప్రదించాయని, తాను చెప్పిన ఓపెన్ జైళ్ల ప్రతిపాదన చాలా రాష్ట్రాలకు నచ్చిందని తెలిపారు. రాజస్తాన్‌లోని సంగనర్ ఓపెన్ జైలును 1954లో ఏర్పాటు చేశారు. అందులో కనీసం 450 మంది శిక్ష పడిన వారు ఉన్నారు. తమ కుటుంబాలతో శాంతి యుతంగా జీవిస్తున్నారు. ఖైదీల నియంత్రణ కోసం ఆ జైలుకు ఎత్తైన గోడలు లేవు. ఇనుప చువ్వలు ఏర్పాటు చేయలేదు. ఖైదీలకు సంబంధించి జైళ్ల కమిటీ ఒకటి ఉంటుంది. అనేక అంశాలపై ఆ కమిటీ చర్చించి నిర్ణయాలు తీసుకుంటుందని ఆమె వివరించారు. బహి రంగ జైళ్ల నుంచి పారిపోతున్న ఖైదీల కన్నా కట్టుదిట్ట ఏర్పాట్లతో నిర్మించిన సాధారణ జైళ్ల నుంచి పారిపోయే ఖైదీలు అధికంగా ఉన్నట్లు ఆమె వెల్లడించారు. రాజస్తాన్ మాజీ డీజీపీ అజిత్ సింగ్ సైతం చక్రవర్తి అభిప్రా యాలతో ఏకీభవించారు. దేశంలోని ఇతర బహిరంగ జైళ్ల మాదిరిగా కాకుండా సంగనర్ జైలు మాత్రం తమ ఖైదీలు బయటికి వెళ్లి పనులు చేయడానికి అనుమతిస్తాం దని అజిత్‌సింగ్ చెప్పారు. నిజం చెప్పాలంటే...సంగనర్ ఓపెన్ జైలు నుంచి బయటికి వెళ్లడానికి శిక్ష పూర్తయిన ఖైదీలు నిరాకరిస్తున్నట్లు ఉదాహరణలతో వివరించారు. బహిరంగ జైళ్లు ఖైదీల జీవితాలు మార్చడానికి చాలా దోహదపడతాయని రాజస్తాన్ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ కల్పేశ్ సత్యేంద్ర ఝవేరీ చెప్పారు. ఈ వ్యవస్థను సక్రమంగా అమలు చేస్తే శిక్ష పూర్తయిన తర్వాత ఖైదీలు ప్రజలతో కలిసి ఉత్తమ జీవితం అనుభవించడానికి వీలుంటుందని పేర్కొన్నారు. బహిరంగ జైళ్ల వ్యవస్థ మానవ హక్కులను పరిరక్షించడమే కాకుండా మామూలు జైళ్లలో ఖైదీల సంఖ్య పెరగకుండా దోహదపడుతుందని వ్యాఖ్యానించారు.

సాంకేతికత గరిష్ఠ వినియోగంతో

దివ్యాంగ పిల్లలకు విద్య

అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ: విద్యలో భాషా సంబంధిత అడ్డంకులను తొలగించడానికి, దివ్యాంగ పిల్లలకు విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి సాంకేతికతను గరిష్ఠంగా ఉపయోగించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం నొక్కి చెప్పారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఆమె ఇక్కడ 2021, 2022 సంవత్సరాలకు దివ్యాంగుల సాధికారత కోసం జాతీయ అవార్డులను ప్రదానం చేశారు. సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తూ, ఐక్యరాజ్యసమితి అంచనా ప్రకారం... ప్రపంచంలో ఒక బిలియన్ కంటే ఎక్కువ మంది ప్రజలు దివ్యాంగులని, అంటే ప్రపంచంలోని దాదాపు ప్రతి 8వ వ్యక్తికి ఏదో ఒక రూపంలో వైకల్యం ఉందని ఆమె చెప్పారు. భారతదేశ జనాభాలో రెండు శాతం కంటే ఎక్కువ మంది దివ్యాంగులు ఉన్నారని, అందువల్ల దివ్యాంగులు స్వతంత్రంగా గౌరవప్రదమైన జీవితాన్ని గడపగలరని నిర్ధారించడం అందరి బాధ్యత అని అన్నారు. 'వారు మంచి విద్యను పొందడం, వారి ఇళ్లలో, సమాజంలో సురక్షితంగా ఉండడం. వారి వృత్తిని ఎంచుకునే స్వేచ్ఛ, సమాన ఉపాధి అవకాశాలను కలిగి ఉండేలా చూడటం కూడా మన కర్తవ్యం' అని రాష్ట్రపతి తెలిపారు. భారత సంస్కృతి, సంప్రదాయంలో, విజ్ఞానాన్ని పొందడంలో, శ్రేష్ఠతను సాధించడంలో వైకల్యం ఎప్పుడూ అవరోధంగా పరిగణించబడలేదని అన్నారు. 'మన దివ్యాంగులు, సోదరీమణులు తమ అలుపెరగని ధైర్యం, ప్రతిభ, దృఢ సంకల్పంతో అనేక రంగాలలో అద్భుతమైన విజయాలు సాధించిన ఉదాహరణలు లెక్కలేనన్ని ఉన్నాయి. తగిన అవకాశాలు, సరైన వాతావరణం కల్పిస్తే వారు అన్ని రంగాల్లోనూ రాణించగలరు' అని ఆమె అన్నారు. దివ్యాంగులతో సహా ప్రతి వ్యక్తి సాధికారతకు విద్య కీలకమని తెలిపారు. వినికిడి లోపం ఉన్న పిల్లల కోసం 1 నుంచి 6 తరగతులకు సంబంధించిన ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాలను భారతీయ సంకేత భాషలోకి మార్చడం సంతోషంగా ఉందని ఆమె అన్నారు. వినికిడి లోపం ఉన్న విద్యార్థులను ప్రధాన స్రవంతి విద్యా ప్రక్రియలో చేర్చడం ఒక ముఖ్యమైన చొరవ అని తెలిపారు. దివ్యాంగుల సాధికారత కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్రపతి అన్నారు. సమాజంలోని అన్ని వర్గాల వారు దివ్యాంగులను స్వావలంబనతో ముందుకు సాగేలా ప్రోత్సహించాలని ఆమె కోరారు. దివ్యాంగులు ప్రధాన స్రవంతిలో చేరడం ద్వారా తమ సమర్థవంతమైన సహకారం అందించినప్పుడే దేశం శరవేగంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని రాష్ట్రపతి తెలిపారు. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖలోని వికలాంగుల సాధికారత విభాగం (దివ్యాంగజన్) ప్రతి సంవత్సరం వికలాంగుల సాధికారత కోసం జాతీయ అవార్డులను వ్యక్తులు, సంస్థలు, సంస్థలు, రాష్ట్రం/జిల్లా మొదలైన వాటికి వారి అత్యుత్తమ విజయాలకు, దివ్యాంగుల సాధికారత కోసం చేసిన పనికి అందజేస్తుంది. ఎంపిక చేసిన దరఖాస్తులను నవంబర్ 2న జరిగిన జాతీయ ఎంపిక కమిటీ తన సమావేశంలో పరిగణించింది. 2021 సంవత్సరానికి 25 అవార్డు గ్రహీతలను, 2022కి 29 అవార్డు గ్రహీతలను సిఫార్సు చేసింది.

యుద్ధాలకు భారత్ వ్యతిరేకం: రాజ్‌నాథ్

బెంగళూరు: యుద్ధాలకు, హింసకు భారత్ వ్యతిరేకమని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. అదేసమయంలో ఇతరులకు ఇబ్బంది కలిగించదు...మనకు ఇబ్బంది కలిగించే వారిని ఉపేక్షించదని స్పష్టంచేశారు. అన్యాయం, అణచివేతపై నోరుమూసుకోబోదని తెలిపారు. బెంగళూరులో ఇస్తాన్ నిర్వహించిన గీత ధనయజ్ఞం కార్యక్రమంలో రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగించారు. మహాభారతం యుద్ధానికి దారితీసిన పరిస్థితులను మంత్రి వివరించారు. భగవద్గీతలో కురుక్షేత్ర యుద్ధం ఎందుకు జరిగిందో శ్రీకృష్ణుడు చెప్పిన అంశాలను ప్రస్తావించారు. గీత విశ్వజనీనమైనదని, అందులోని అంశాలు అన్ని దేశాలకు వర్తిస్తాయని పేర్కొన్నారు. భగవద్గీత చదివితే ఎవరికైనా భయమనేది ఉండదన్నారు. సాంస్కృతిక, మతపరమైన అంశాలను ప్రచారం చేస్తూనే భగవద్గీత లక్ష గ్రంథాలు ఉచితంగా పంపిణీ చేయాలని ఇస్తాన్ నిర్ణయించింది. కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప, ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల మాట వినుంటే..

జోడో యాత్రతో పనిలేదు: పచౌరీ



అమ్లా(మధ్యప్రదేశ్): కేంద్రంలో ఉన్న నిరంకుశత్వ ప్రభుత్వం ప్రతిపక్షాల మాట విని ఉంటే, కాంగ్రెస్ పార్టీకి భారత్ జోడో యాత్ర చేపట్టాల్సి వచ్చేది కాదనీ మాజీ కేంద్ర మంత్రి సురేశ్ పచౌరీ తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని బెతుల్ జిల్లా, అమ్లాలో జరుగుతున్న భారత్ జోడో యాత్రలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'నిరంకుశత్వ ప్రభుత్వం ప్రతిపక్షాల మాట విని ఉంటే, పార్లమెంట్‌లో మాట్లాడేందుకు రైతుకు అవకాశం వచ్చి ఉండేది. అప్పుడు కాంగ్రెస్ భారత్ జోడో యాత్ర పేరుతో బయటకు వచ్చే కాదు' అని పచౌరి తెలిపారు. 'రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేయకుండా ఉండుంటే, మాట్లాడే హక్కును కోల్పోయి ఉండేవాళ్ల కాదనీ, ప్రజాస్వామ్య పునాదులు పటిష్టంగా ఉండేవి. ఇలాంటి యాత్రకు అవకాశమే ఉండేది కాదు' అని పేర్కొన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలి స్తామన్న మోదీ వాగ్దానం మోసమని నిరూపితమైందనీ, అలాగే ప్రజల అకౌంట్లలో రూ.15లక్షలు వేస్తామన్నది కూడా నీటి మూటగానే మిగిలిపోయిందన్నారు. రైతులకు రెట్టింపు ఆదాయం వస్తుందన్న హామీ కూడా పూర్తి చేయలేదని, ప్రస్తుతం రైతులు తాము పెట్టిన పెట్టుబడి కూడా దక్కడం లేదన్నారు. ఆర్థికవ్యవస్థను నోట్ల రద్దు, జీఎస్టీలు గాడి తప్పేలా చేశాయనీ, బ్లాక్‌మనీ అడ్డుకోవడంలోనూ విఫలమైందని పచౌరి విమర్శించారు. నిత్యావసరాల పెరుగుదల, పెట్రోలు, డీజిల్ ధరల పెరుగుదల సామాన్యుడిని కోలుకోనీయకుండా చేశామన్నారు. 3,500 కిలోమీటర్లు, 12 రాష్ట్రాలు, 140 రోజుల భారత్ జోడో యాత్ర ఆదివారం మధ్యప్రదేశ్ నుంచి రాజస్థాన్‌లోకి అడుగుపెట్టనున్నట్టు పచౌరి వివరించారు.

జి-20 ప్రతినిధులకు రాజస్థానీ రుచులు

మూడు సమావేశాల్లో భాగంగా నేడు ఉదయ్‌పూర్‌కు

ఉదయ్‌పూర్: ఉదయపూర్‌లో భారతదేశం అధ్యక్షతన జరగ నున్న మొదటి షెర్పా సమావేశంలో జి-20 దేశాల ప్రతినిధులు రాజ స్థానీ వంటకాల రుచులను ఆస్వాదించనున్నారు. ప్రతినిధులు ఆదివారం సరస్సుల నగరానికి చేరుకుంటారు. సోమ, మంగళ వారాల్లో సమావేశాలు జరుగుతాయి. బుధవారం వారు రాజ్ సమంద్‌లోని 15వ శతాబ్దపు అద్భుతమైన కుంభాల్‌ఘర్ కోట, పాలి జిల్లాలోని రణక్‌పూర్ జైన దేవాలయాన్ని సందర్శిస్తారు. ఈ నాలుగు రోజులలో ప్రతినిధులకు రాజస్థానీతో పాటు దక్షిణ భారత వంట కాలు, హైదరాబాదీ, గుజరాతీ, పంజాబీ వంటకాలను అందిం చనున్నట్లు ఉదయపూర్ టూరిజం డిప్యూటీ డైరెక్టర్ శిఖా సక్సేనా పీటీఐకి తెలిపారు. 'భారతీయ ఆహారం, రాజస్థానీ రుచిపై ప్రత్యేక దృష్టి సారించడం మెనులోని ముఖ్యాంశాలు. అన్ని రకాల ఆహార, వెల్‌నెస్ డ్రింక్స్ ఉన్నాయి' అని సక్సేనా చెప్పారు. ప్రసిద్ధ పప్పు, బతి, చుర్మా... ప్రతి ఒక్కటి విభిన్న రుచులను కలిగి ఉంటా యని, అలాగే, గట్టా కూర, కెర్ సంగ్రి, రాజస్థానీ గట్టా పులావ్ వడ్డిస్తారని తెలి పారు. అలాగే భారతీయ భోజనంలో బికనేరి ఘేవర్, జోధ్‌పురి మావా కచౌరీ, మూడు రకాల శ్రీఖండ్, కుంకుమపువ్వు ఖీర్, మలై ఘేవర్, రోషోగొల్ల, మకాన్ బడా వంటివి ముఖ్యంగా ఉంటాయి. అంతేకాదు మోతీచూర్, బేసన్, డ్రై ఫ్రూట్స్ లడ్డూలు కూడా ఉంటాయి. దాల్ బాటి చుర్మా లేదా జోధ్‌పురి కాబూలీ పులావ్‌తో కూడిన భోజనం, దాని తర్వాత బికనేరి ఘేవర్ లేదా జోధ్‌పురి మావా కచౌరీని అందిస్తారు. ఇక వేదికల వద్ద సాంప్రదాయ రాజస్థానీ ఫుడ్ స్టేషన్, హైదరాబాదీ ఫుడ్ కార్నర్, పకౌడా స్టేషన్, పావ్ స్టేషన్, స్ట్రీట్ ఫుడ్ స్టేషన్ తదితరాలను ఏర్పాటు చేస్తారు. ఆదివారం ప్రతినిధులకు హోటల్ లీలా ప్యాలెస్‌లో గ్రాండ్ రిసెప్షన్ జరగనుంది. మరుసటి రోజు, హోటల్ తాజ్ ఫతే ప్రకాష్ ప్యాలెస్ దర్బార్ హాలులో చర్చలు ప్రారంభమవుతాయి. పర్యటన సందర్భంగా ప్రతినిధులు సిటీ ప్యాలెస్, జగ్‌మందిర్‌ను సందర్శిస్తారు. అక్కడ సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయి. కాగా వెస్ట్ జోన్ కల్చరల్ సెంటర్‌లోని శిల్పగ్రామ్‌లో ప్రతినిధులు గ్రామీణ జీవితం గురించి తెలుసుకుం టారని అధికార వర్గాలు తెలిపాయి. ఈ మూడు రోజుల సమావే శాల్లో వేగవంతమైన, సమ్మిళిత, స్థితిస్థాపకమైన వృద్ధి, బహు పాక్షికత, ఆహారం, ఇంధనం, ఎరువు, మహిళల నేతృత్వంలోని అభివృద్ధి వంటి వివిధ అంశాల పై సమావేశాలు జరుగుతాయి. జి-20 లేదా గ్రూప్ ఆఫ్ 20 అనేది ప్రపంచంలోని ప్రధాన అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల అంతర్ ప్రభుత్వ ఫోరమ్. ఇందులో అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండియా, ఇండోనేషియా, ఇటలీ, జపాన్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, టర్కీ బ్రిటన్, అమెరికా, యూరోపియన్ యూనియన్ ఉన్నాయి.

జోడో యాత్రలో పాల్గొన్నందుకు ఉపాధ్యాయుడి సస్పెన్షన్

బర్వానీ(మధ్యప్రదేశ్): రాహుల్ జోడో యాత్రలో పాల్గొన్నం దుకు ఉపాధ్యాయుడు సస్పెండ్ అయినట్టు అధికారులు తెలిపారు. రాహుల్ గాంధీ జోడో యాత్ర మధ్యప్రదేశ్‌లోని బర్వానీ జిల్లాలో జరుగుతున్న విషయం తెలిసిందే. కన్సాయాలోని రాష్ట్రానికి గిరిజన శాఖ ఆధ్వర్యంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యా యుడిగా పనిచేస్తున్న రాజేశ్ కన్నోజీని నవంబర్ 25న సస్పెండ్ చేయగా, ఆ ఉత్తర్వులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యి, ఆలస్యంగా వెలుగు చూశాయి. 'రాజకీయ పార్టీ కార్యక్రమంలో పాల్గొనడం నిబంధనలు ఉల్లంఘించడమే. ముఖ్యమైన పని ఉందని అతడు సెలవు పెట్టాడు. కానీ యాత్రలో పాల్గొన్నట్టు ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో పెట్టాడు' అని గిరిజన వ్యవహారాల శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్ఎస్ రఘువంశీ తెలిపారు.

విశాలాంధ్ర

సాయిబాబా విడుదల కోరుతున్న వారిపై

ఏబీవీపీ గూండాల దాడి

న్యూదిల్లీ : దిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబాను విడుదల చేయాలని కోరుతూ నార్త్ క్యాంపస్ ప్రాంతంలో ప్రచారం చేస్తుండగా ఏబీవీపీ సభ్యులు తమపై దాడి చేశారని దాదాపు 36 సంఘాల సంయుక్త వేదిక 'క్యాంపైన్ అగైనెస్ట్ స్టేట్ రిప్రెషన్' సభ్యులు తెలిపారు. గురువారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. తమ పై రాళ్లు, లాఠీలు, ఇనుప రాడ్‌లతో వారు దాడి చేశారని, ఐదుగురు సభ్యులు గాయపడ్డారని చెప్పారు. భగత్ సింగ్ ఛత్ర ఏక్తా మంచ్ (బీసీఈఎం)కు చెందిన విద్యార్థి కార్యకర్త సంగీత మీడియాతో మాట్లాడుతూ మారిస్ నగర్ పోలీసు స్టేషన్ ఏరియాలో ప్రచారం చేస్తూ, పాటలు పాడుతుండగా, ఇద్దరు వ్యక్తులు తమ వద్దకు వచ్చారని చెప్పారు. ఆ తర్వాత వారు ఫోన్లు చేయగా, కొందరు మహిళలు సహా 60 నుంచి 70 మంది వచ్చారని తెలిపారు. దాదాపు 15 మంది పై దాడి జరిగిందన్నారు. కొద్ది సేపయిన తర్వాత ఏబీవీపీ గూండాలు మూడు కార్లలో వచ్చి, ఆప్ పతాకాలతో ముఖాలు కప్పుకున్నారని చెప్పారు.

జడ్జీల్ని నియమించుకోనివ్వరా? ధన్కర్

న్యూదిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకం విషయంలో కేంద్రానికి స్వేచ్ఛనివ్వకుండా సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయాలు తీసుకోవడంపై యుద్ధమే జరుగుతోంది. ఈ నేపథ్యంలో జాతీయ న్యాయ నియామకాల కమిషన్ ఎన్‌జేఏసీని కొట్టేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆగ్రహంగా ఉన్న ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్కర్ శనివారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముందే తన అసంతృప్తిని బహిరంగంగానే వెళ్లగక్కారు. దిల్లీలో శనివారం జరిగిన ఎల్‌ఎం సింఘ్వీ స్మారక ఉపన్యాసంలో ఉపరాష్ట్రపతి ధన్కర్ ప్రసంగిస్తూ.. రాజ్యాంగ పీఠికలో "మేము ప్రజలు" అని పేర్కొన్నారని, అలాగే పార్లమెంటు ప్రజల అభీష్టాన్ని ప్రతిబింబిస్తుందని స్పష్టం చేశారు. దీనికి భిన్నంగా సుప్రీంకోర్టు న్యాయనియామకాల కమిషన్ ఏర్పాటు కోసం పార్లమెంట్ చేసిన చట్టాన్ని కొట్టేసిందన్నారు. జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసిన తర్వాత పార్లమెంటులో దీనిపై ఎలాంటి చర్చా లేదన్నారు. ప్రజల అభీష్టాన్ని ప్రతిబింబించేలా పార్లమెంటు ఆమోదించిన చట్టాన్ని సుప్రీంకోర్టు "రద్దు" చేసిందని, ప్రపంచంలో ఎక్కడా ఇలా జరగలేదన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిబంధనలను ఊటంకించిన ఉపరాష్ట్రపతి... చట్టంపై అభ్యంతరాలు ఉంటే సమస్యను కోర్టులు పరిశీలించవచ్చని అన్నారు. నిబంధనలు రద్దు చేయొద్దని ఎక్కడా చెప్పలేదని ధన్కర్ గుర్తుచేశారు. ఎన్‌జేఏసీ చట్టాన్ని ప్రస్తావిస్తూ.. 2015-16లో పార్లమెంటు రాజ్యాంగ సవరణతో చట్టం చేసిందని, రికార్డు ప్రకారం మొత్తం లోక్‌సభ ఏకగ్రీవంగా ఓటు వేసిందని గుర్తుచేశారు. రాజ్యసభలో ఏకగ్రీవం కాగా, ఒక్కరు గైర్హాజరయ్యారన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను నియమించే కొలీజియం వ్యవస్థను రద్దు చేసేందుకు ఉద్దేశించిన ఎన్‌జేఏసీ చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్న సుప్రీంకోర్టు గతంలో కొట్టేసింది. దీనిపై స్పందించిన ఉపరాష్ట్రపతి.. ఈ సభలో పాల్గొన్న వారిని ఉద్దేశించి ఓ విజ్ఞప్తి చేస్తున్నానని, మీరంతా న్యాయపరంగా ఉన్నత వర్గమని, ఆలోచనాపరులు, మేధావులని, దయచేసి ప్రపంచంలో ఒక రాజ్యాంగ నిబంధనను రద్దు చేసిన సందర్భం ఉంటే చెప్పాలని కోరారు. నవంబర్ 26న ఢిల్లీలో జరిగిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలోనూ ఉపరాష్ట్రపతి ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆసుపత్రుల్లో రెండోరోజూ ఈడీ సోదాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : మంగళగిరి ఎన్ఆర్ఐ ఆసుపత్రితో పాటు విజయవాడలోని అక్కినేని ఉమెన్స్ ఆసుపత్రిలో రెండోరోజూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు కొనసాగాయి. మాన్యువల్, నకిలీ రసీదులతో నిధులను పక్కదారి పట్టించారన్న ఆరోపణలతో ఈడీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. కోవిడ్ చికిత్స తీసుకున్న 1500 మంది పేషంట్ల వివరాలు రికార్డుల్లో చేర్చలేదని ఈడీ గుర్తించినట్లు సమాచారం. అధికారులు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఎన్ఆర్ఐ నిధులతో అక్కినేని ఉమెన్స్ హాస్పిటల్ వైద్య పరికరాలు కొనుగోలు చేసినట్లు అనుమానిస్తున్నారు. దిల్లీ నుంచి వచ్చిన నాలుగు బృందాలు నిర్దేశిత ప్రాంతాలు, సంస్థలు, వ్యక్తుల నివాసాల్లో సోదాలు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఎన్ఆర్ఐలో డైరెక్టర్‌గా ఉంటూ విజయవాడలో అక్కినేని ఉమెన్స్ ఆసుపత్రి ప్రారంభించిన ఆర్థిక వ్యవహారాలపై అధికారులు ఎక్కువగా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. కొన్నేళ్లుగా ఆయా ఆసుపత్రుల యాజమాన్యం కడుతున్న ఆదాయ పన్ను చెల్లింపులకు సంబంధించిన పత్రాలను ఈడీ అధికారులు సేకరించారు. అలాగే కొన్ని కీలక రికార్డులను, హార్డ్‌డిస్కులను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు రూ.100 కోట్ల వరకు ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించినట్లు చెబుతున్నారు. విదేశీ నిధులను సొంత ఖాతాలకు మళ్లించారన్న ఆరోపణలపై, ఎన్ఆర్ఐ కోటాలో మెడికల్ సీట్ల ద్వారా కోట్లలో సేకరించారని, కోవిడ్ సమయంలో పేషెంట్ల నుంచి భారీగా వసూలు చేసిన నిధులను మళ్లించారన్న ఆరోపణలపై అధికారుల దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం.

కోవిడ్ నిరోధక చర్యల వల్ల

90 శాతం మందిలో రోగనిరోధక శక్తి

ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడి

జెనీవా: కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాల్సిందేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) హెచ్చరించింది. లేకపోతే మరో కొత్త వేరియంట్ విరుచుకుపడే అవకాశాలు లేకపోలేదని చెప్పింది. నిఘా, పరీక్షలు, వాక్సిన్‌లతో వైరస్‌పై నియంత్రణ సాధించగలిగామని తెలిపింది. కరోనా వైరస్ సోకడం ద్వారా, వాక్సిన్ కారణంగా ప్రపంచ జనాభాలో దాదాపు 90 శాతం మంది ఇప్పుడు కొంత మేర రోగనిరోధక శక్తిని కలిగి ఉన్నారని డబ్ల్యూహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అథనామ్ తెలిపారు. కరోనా కొత్త వేరియంట్‌లతో విరుచుకుపడటంతో ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు ఆరవై లక్షల మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. కరోనాను అడ్డుకునే వ్యూహాత్మక యత్నాల వైఫల్యంతో ఈ ఏడాది కొత్త వేరియంట్ పుట్టుకువచ్చే పరిస్థితులు ఉండవచ్చని తెలిపారు. మహమ్మారి అత్యవసర దశ ముగిసిందని చెప్పడానికి దగ్గరగా ఉన్నప్పటికీ ఇప్పటికిప్పుడే ఆ విధంగా ప్రకటించలేమని తెలిపారు. చైనాలో వైరస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో టెడ్రోస్ పై విధంగా వ్యాఖ్యానించారు. చైనా సహా ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు దీర్ఘకాల రోగాలు కలిగిన వారు, 60 ఏళ్లు దాటిన వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డబ్ల్యూహెచ్‌ఓ టెక్నికల్ లీడ్ మారియా వాన్ ఖేర్ఖోవ్ సూచించారు.

భారత్ నాలో భాగం: సుందర్ పిచాయ్

వాషింగ్టన్: భారత ప్రభుత్వం అందించిన ప్రతిష్ఠాత్మక పురస్కారం పద్మభూషణ్ అవార్డును పిచాయ్ తాజాగా అందుకున్నారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. "ఈ అపారమైన గౌరవం కల్పించిన భారత ప్రభుత్వానికి, ప్రజలకు నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. నన్ను తీర్చిదిద్దిన దేశం నుంచి ఈ గౌరవం పొందడం గర్వంగా భావిస్తున్నా. భారత్ నాలో భాగమే. నేను ఎక్కడికివెళ్లినా ఆ వారసత్వాన్ని నా వెంట తీసుకెళ్తా" అని పిచాయ్ ఆనందం వ్యక్తం చేశారు. సాంకేతిక పరంగా భారత్‌లో వేగంగా మార్పులు వస్తున్నాయని, భారత్‌లో సృష్టించిన ఎన్నో ఆవిష్కరణలు ప్రపంచానికి మేలు చేస్తున్నాయని ఆయన కొనియాడారు. గూగుల్, భారత్ మధ్య ఉన్న గొప్ప భాగస్వామ్యాన్ని కొనసాగించేందుకు తాను ఉత్సాహంగా ఉన్నట్లు తెలిపారు. "ప్రధాని మోదీ చేపట్టిన డిజిటల్ ఇండియా విజన్.. దేశాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది. భారత్‌లో గూగుల్ పెట్టుబడులు కొనసాగించడం గర్వంగా భావిస్తున్నా. మన గడప వరకు చేరే ప్రతి సాంకేతికత మన జీవితాలను మరింత మెరుగుపరుస్తుంది" అని పిచాయ్ అన్నారు. ఈ ఏడాది జనవరిలో భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పౌర పురస్కారాలైన పద్మ అవార్డులను ప్రకటించింది. వాణిజ్యం, పరిశ్రమల విభాగంలో సుందర్ పిచాయ్‌కు పద్మభూషణ్ వరించింది. ఈ పురస్కారాన్ని అమెరికాలోని భారత రాయబార రాయబారి తరణ్‌జిత్ సింగ్ సంధు నుంచి పిచాయ్ శుక్రవారం(అమెరికా కాలమానం ప్రకారం) అందుకున్నారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన ఈ కార్యక్రమంలో పిచాయ్ కుటుంబసభ్యులతో పాటు భారత కాన్సుల్ జనరల్ టీవీ నాగేంద్ర ప్రసాద్ ఉన్నారు. సుందర్ పిచాయ్ చెన్నైలో జన్మించారు. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో మెటలర్జికల్ ఇంజినీరింగ్ చేసిన పిచాయ్ 2004లో గూగుల్‌లో ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ ఉపాధ్యక్షుడిగా చేరారు. 2015 ఆగస్టులో గూగుల్ బాధ్యతలు చేపట్టారు. అత్యంత విజయవంతమైన గూగుల్ క్రోమ్ బ్రౌజర్‌తో పాటు ఆపరేటింగ్ సిస్టమ్ ఆండ్రాయిడ్, యాప్స్ ఆవిష్కరణ బృందాలకు నేతృత్వం వహించారు.

సమానత్వమే అంబేద్కర్ ఆకాంక్ష

డిజిటల్ ఇండియాతో సాకారం

కేంద్ర మంత్రి నారాయణస్వామి

విశాలాంధ్ర-విశాఖసిటీ: సమానత్వం, సమాన అవకాశాల కల్పనే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆకాంక్ష అని కేంద్ర సహాయ మంత్రి నారాయణస్వామి అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో "అంబేద్కర్ ఆలోచనలు-డిజిటల్ ఇండియాతో సాకారం చేసిన మోదీ' అంశంపై శనివారం నిర్వహించిన సదస్సులో కేంద్రమంత్రి వర్చువల్‌గా ప్రసంగించారు. డిజిటల్ నాలెడ్జ్ అందరికీ అందుబాటులో ఉండాలని, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, సాగరమాల వంటి పథకాలు ప్రజలను అభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నాయని నారాయణస్వామి అన్నారు. గ్రామాలను జాతీయ రహదారులతో అనుసంధానం చేచేస్తున్నామని, గ్రామాలకు ఇంటర్నెట్ సేవలను అందుబాటులో తెస్తున్నామని చెప్పారు. వీటి ద్వారా ప్రజలకు అవకాశాలు పెంచుతూ, సామాజిక న్యాయాన్ని సాకారం చేస్తున్నామన్నారు. అంబేద్కర్ ఆలోచనలను వ్యాప్తి చేయాలన్నారు. అట్టడుగు వర్గాలకు అభివృద్ధి ఫలాలను నేరుగా చేరువ చేస్తున్న విధానాలను వివరించారు. ఏయూ అంబేద్కర్ చైర్‌తో గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాలకు సైతం సేవలు అందించాలని సూచించారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ నైతిక విలువలు కలిగి ఉండటం ప్రధానమన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎదురయ్యే సాంకేతిక సమస్యలకు భారతీయులే పరిష్కారాలు చూపుతున్నారన్నారు. మహిళా సాధికారత సాకారం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పనిచేస్తున్నారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, సీఎం జగన్ గ్రాస్ హ్యాపీనెస్ ఇండెక్స్ మెరుగుదల కోసం కృషి చేస్తున్నారన్నారు. విశిష్ఠ అతిథి ఎస్‌టీపీ అదనపు డైరెక్టర్ డాక్టర్ సురేశ్ బాత మాట్లాడుతూ ప్రతీ భారతీయుడు డిజిటల్ ఇండియా ప్రాధాన్యత తెలుసుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా 85 వేలకు పైగా అంకుర పరిశ్రమలు ఉన్నాయన్నారు. డిజిటల్ ఇండియా ఫలాలను పూర్తిస్థాయిలో ప్రజలకు చేరువ చేసే దిశగా ఏయూ అంబేద్కర్ చైర్ చేస్తున్న కృషిని అభినందించారు. ఏయూ అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ మానవ వికాసం, అభివృద్ధికి ఉపయుక్తంగా అంబేద్కర్ చైర్ పనిచేస్తున్నదన్నారు. సమానత్వం, స్వేచ్ఛ, సమాన అవకాశాలు కల్పిస్తూ అందరినీ మిళితం చేస్తూ ముందుకు సాగుతామన్నారు. రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తదితరులు ప్రసంగించారు. ఆచార్యులు ఎన్.కిశోర్‌బాబు, కృష్ణ మంజరి పవార్, టి.శోభశ్రీ, హెచ్.పురుషోత్తం, టి.షారోన్ రాజు, కె.బసవయ్య, వి.సిద్ధయ్య, కె.వెంకటరావు, వజీర్ మహ్మద్, సీఎన్‌వీ సత్యనారాయణ రెడ్డి, ఎస్‌ఏడీ పాల్ తదితరులు పాల్గొన్నారు.

సర్వం సిద్ధం

నేడు ఎంసీడీ పోలింగ్

భారీగా బలగాల మోహరింపు

న్యూదిల్లీ: దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) ఎన్నికలకు అధికారులు సర్వసన్నద్ధమయ్యారు. ఎంసీడీ ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో ఇతర చిన్నాచితక పార్టీలు సహా ఆప్, బీజేపీ, కాంగ్రెస్ తలపడుతున్నాయి. 1.45 కోట్లమంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల అధికారులు, భద్రతా దళాలను మోహరించారు. మూడు ప్రధాన పార్టీలు-ఆప్, బీజేపీ, కాంగ్రెస్ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి మొత్తం 250 వార్డుల్లో 1349 మంది అభ్యర్థులు రంగంలో నిలిచారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగుతుంది. డిసెంబరు 7వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది. దిల్లీలో మొత్తం ఓటర్లు 1,45, 05, 358 ఉండగా....అందులో పురుషులు 78,93,418 మంది, మహిళలు 66,10,879 మంది ఉన్నారు. ట్రాన్స్‌జెండర్లు1061 మంది ఉన్నారు. ఇవి వార్డుల పునర్విభజన తర్వాత జరుగుతున్న మొదటి కార్పొరేషన్ ఎన్నికలు. 13,638 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. 272 వార్డులతో గల మూడు కార్పొరేషన్లు-ఎన్‌డీఎంసీ, ఎస్‌డీఎంసీ, ఈడీఎంసీలను కలిపి 250 వార్డులతో దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ ఎన్నికల్లో విజయంపై ఆప్, బీజేపీ ధీమాగా ఉన్నాయి. అత్యధిక సీట్లు సాధించి పూర్వ వైభవం తెచ్చుకుంటామని కాంగ్రెస్ భావిస్తోంది. ఎంసీడీ ఎన్నికల కోసం అన్ని పార్టీలు విస్తృత ప్రచారం చేశాయి. బీజేపీ తరపున కేంద్రమంత్రులు మొదలుకొని ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులు ప్రచారంలో పాల్గొనగా ఆప్ తరపున ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఆయన కేబినెట్ సహచరులు, ఆప్ నేతలు ప్రచారం చేశారు. బీజేపీ నాయకులు 200 బహిరంగసభలు, రోడ్‌షోలు నిర్వహించింది. ఆదివారం నాటి పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల అధికారులు తెలిపారు. భారీగా భద్రతా బలగాలను మోహరించినట్లు వెల్లడించారు.

గర్వంగా ఉంది చరణ్: చిరంజీవి

హైదరాబాద్: ఫ్యూచర్ ఆఫ్ యంగ్ ఇండియా కార్యక్రమంలో ట్రూ లెజెండ్‌గా రామ్‌చరణ్ అవార్డు అందకోవడంపై చిరంజీవి ఆనందం వ్యక్తం చేశారు. చరణ్ ఈ అవార్డు అందుకోవడం గర్వంగా ఉందని సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. రామ్‌చరణ్ ఫొటో షేర్ చేసి "కంగ్రాట్స్ డియర్ చరణ్. ఫ్యూచర్ ఆఫ్ యంగ్ ఇండియాలో ట్రూ లెజెండ్ అవార్డు అందుకున్నందుకు నేనెంతో గర్విస్తున్నా. నువ్వు ఇలాగే ముందుకు సాగాలని అమ్మా నేనూ కోరుకుంటున్నాం" అని చిరంజీవి రాసుకొచ్చారు. దీనికి చరణ్ కూడా స్పందించారు. 'లవ్ యూ అప్పా' అని రిప్లై ఇచ్చారు. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులకు ఓ ఆంగ్ల పత్రికా సంస్థ ఫ్యూచర్ ఆఫ్ యంగ్ ఇండి అవార్డులను అందజేసింది. వినోద రంగంలో రామ్‌చరణ్ ట్రూ లెజెండ్ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో చరణ్ తన తండ్రి సేవలను కొనియాడారు. నటనలో చిరు వారసత్వాన్ని కొనసాగిస్తున్నా అని చెప్పారు. ట్రూ లెజెండ్ అవార్డు తన తండ్రికి అంకితమిస్తున్నానని అన్నారు. ప్రస్తుతం రామ్‌చరణ్ శంకర్ దర్శకత్వంలో 'ఆర్‌సీ15' సినిమా చేస్తున్నారు.

అడవుల్లో సాహసం నేపథ్యంలో 'ఎస్ఎస్ఎంబీ-29' చిత్రం

హైదరాబాద్: దేశంలోని పేరున్న కథా రచయితల్లో విజయేంద్ర ప్రసాద్ ఒకరు. 'ఈగ', 'బజరంగీ భాయిజాన్', 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' వంటి చిత్రాలకు కథలను అందించారు. ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వం వహించిన అన్ని సినిమాలకు కూడా రచయితగా వ్యవహరించారు. మహేశ్ బాబుతో జక్కన్న చేయబోయే తర్వాతి ప్రాజెక్టుకు కూడా కథను అందిస్తున్నారు. ఈ మూవీకి వర్కింగ్ టైటిల్‌గా 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' అని వ్యవహరిస్తున్నారు. విజయేంద్ర ప్రసాద్ తాజాగా మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. రాజమౌళి, మహేశ్ సినిమాకు సంబంధించిన ఆసక్తికర సంగతులను అభిమానులతో పంచుకున్నారు. 'మహేశ్ బాబు అద్భుతమైన నటుడు. యాక్షన్ సన్నివేశాల్లో చాలా ఇంటెన్స్‌గా నటిస్తాడు. అందువల్ల రైటర్‌కు ఎక్కువ పని ఉండదు. అతడి పాత్ర నుంచి హావభావాలు పలికించడానికి తక్కువ సమయం చాలు. ఫలితంగా ప్రతి ఒక్కరి పని సులభమవుతుంది. చాలా కాలంగా నా కుమారుడు ఫారెస్ట్ అడ్వెంచర్ నేపథ్యంలో సినిమా చేయాలనుకుంటున్నారు. కానీ, ఎప్పుడు అవకాశం రాలేదు. ప్రస్తుతం మహేశ్ బాబుతో అటువంటి చిత్రం చేసే ఛాన్స్ వచ్చింది. ప్రస్తుతం కథను రాస్తున్నాం. స్టోరీ వేర్వేరు ప్రదేశాల్లో కొనసాగుతుంది. అందువల్ల చిత్రం షూటింగ్‌ను అనేక దేశాల్లో చేపట్టనున్నాం.

రాజమౌళికి మరో అరుదైన పురస్కారం!



హైదరాబాద్: 'ఆర్ఆర్ఆర్'కు మరో అవార్డు దక్కింది. హాలీవుడ్‌లో ప్రతిష్ఠాత్మకంగా భావించే 'ది న్యూయార్క్ ఫిల్మ్ క్రిటిక్స్ సర్కిల్' అవార్డు ఈ చిత్రాన్ని వరించింది. వార్తా పత్రికలు, మ్యాగజైన్స్, ఆన్‌లైన్ మీడియాకు సంబంధించిన ప్రముఖులు ఒక టీమ్‌గా ఏర్పడి 1935 నుంచి సినీ పరిశ్రమలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఈ పురస్కారాన్ని అందజేస్తున్నారు. తాజాగా ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు రాజమౌళిని వరించింది. అమెరికాలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో 'ఆర్ఆర్ఆర్' చిత్రానికి గానూ ఉత్తమ దర్శకుడిగా రాజమౌళి ఈ అవార్డు సొంతం చేసుకున్నారు. రామ్‌చరణ్ -జూ.ఎన్టీఆర్ కీలక పాత్రధారులుగా రాజమౌళి దర్శకత్వం వహించిన ఈ చిత్రం రూ.400 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి సుమారు రూ.1200 కోట్లు వసూళ్లు రాబట్టింది. ప్రపంచ వ్యాప్తంగా అలరించిన ఈ సినిమా ఇప్పటికే శాటర్న్, సన్‌సెట్ సర్కిల్ వంటి పలు అంతర్జాతీయ అవార్డులు దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఆస్కార్ బరిలోనూ దిగింది.

కమ్యూనిస్టు ఉద్యమాభివృద్ధికి

చింతపల్లి లక్ష్మారాయుడు కుటుంబం 3 లక్షల విరాళం

విశాలాంధ్ర- గన్నవరం: కమ్యూనిస్టు ఉద్యమాభివృద్ధి కోసం కృష్ణాజిల్లా గన్న వరంకు చెందిన చింతపల్లి లక్ష్మారాయుడు కుటుంబం సీపీఐ, సీపీఎంలకు 3లక్షల రూపాయలు విరాళంగా అందజేసింది. చింతపల్లి లక్ష్మారాయుడు, కాశీ అన్నపూర్ణమ్మ కళ్యాణ మండపం ప్రారంభం సందర్భంగా బుద్ధవరంలో జరిగిన సభలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణకు రూ1.50 లక్షల చెక్కును, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు రూ. 1.50లక్షల చెక్కును చింత పల్లి లక్ష్మారాయుడు కుటుంబ సభ్యుల తరుపున వారి కుమారుడు చింతపల్లి పాపారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి నాగభూషణం, పాపా రావు, ఎర్నేనేని అరుణకుమారి, వీరమాచినేని స్వరూప రాణి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

షమీ ఔట్...ఉమ్రాన్ ఇన్

నేటి నుంచి బంగ్లాదేశ్‌లో సిరీస్

న్యూదిల్లీ: బంగ్లాదేశ్‌తో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్‌కు ముందు టీమిండియాకు షాక్ తగిలింది. గాయం కారణంగా సీనియర్ పేసర్ షమీ ఈ సిరీస్ మొత్తానికి దూరం అయ్యాడు. బీసీసీఐ ఈ మేరకు ట్వీట్ చేసింది. భుజం గాయంతో షమీ ఇబ్బందిపడుతున్నట్లు వెల్లడించింది. షమీ స్థానంలో భారత యువ పేసర్ ఉమ్రాన్ మాలిక్‌కు జట్టులో చోటు కల్పించారు. "బంగ్లాతో వన్డే సిరీస్‌కు ముందు నిర్వహించిన ట్రైనింగ్ సెషన్‌లో షమీకి గాయమైంది. అతడు ప్రస్తుతం ఎన్‌సీఏ పర్యవేక్షణలో ఉన్నాడు. బంగ్లాదేశ్‌కు వెళ్లే టీమ్‌తో అతడు వెళ్లలేదు' అని బీసీసీఐ తెలిపింది. అయితే అతడి గాయం తీవ్రత ఏ స్థాయిలో ఉందో తెలియరాలేదు. వన్డే సిరీస్‌తోపాటు ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్న టెస్టు సిరీస్‌కూ షమీ దూరమయ్యే అవకాశాలు ఉండటం ఇప్పుడు జట్టులో ఆందోళన కలిగిస్తోంది. 'వన్డే సిరీస్‌కు షమీ లేకపోవడం పెద్ద లోటే. అయితే.. బుమ్రా గైర్హాజరిలో టెస్టు సిరీస్‌కూ అతడు దూరమైతే ఇది అంతకంటే పెద్ద ఆందోళనే' అని ఓ బీసీసీఐ అధికారి తెలిపారు. ఎందుకంటే జూన్‌లో ఓవల్‌లో జరగబోయే ప్రపంచకప్ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్ రేసులో ఉండాలంటే.. టీమిండియా ప్రతి మ్యాచ్ గెలవాల్సిన అవసరం ఉంది. షమీ ఇప్పటి వరకూ 60 టెస్టు మ్యాచ్‌ల్లో 216 వికెట్లు పడగొట్టాడు. ఇక బంగ్లా పర్యటనలో భాగంగా ఆతిథ్య జట్టుతో మూడు వన్డేలు, రెండు టెస్టులు ఆడనుంది.

టీమిండియా జట్టు ఇదే.. : రోహిత్ శర్మ(కెప్టెన్), కేఎల్ రాహుల్ (వైఎస్ కెప్టెన్), ధావన్, కోహ్లి, రజత్ పాటిదార్, శ్రేయస్ అయ్యర్, రాహుల్ త్రిపాఠి, పంత్(వికెట్ కీపర్), ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), షాబాజ్ అహ్మద్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, శార్దుల్ ఠాకూర్, సిరాజ్, దీపక్ చాహర్, కుల్‌దీప్‌సేన్, ఉమ్రాన్ మాలిక్.

కోలుకున్న పాంటింగ్

పెర్త్: ఆస్ట్రేలియా బ్యాటింగ్ దిగ్గజం, మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ అస్వస్థతకు గురై తిరిగి కోలుకున్నాడు. ప్రస్తుతం అతడు ఆరోగ్యంగా ఉన్నాడు. స్వల్ప అనారోగ్యం అనంతరం శనివారం ఉదయం తిరిగి ఎంతో ఉత్సాహంగా కామెంట్రీ విధుల్లోకి వచ్చానని పాంటింగ్ స్వయంగా వెల్లడించడం విశేషం. 'బహుశా నేను చాలా మందిని భయపెట్టి ఉంటాను. నిజం చెప్పాలంటే.. నాకు కూడా అది భయంకరమైన క్షణమే. అయితే, ఈ ఉదయం నాకెంతో గొప్పది. షైనీ అండ్ న్యూ' అంటూ పాంటింగ్ కామెంట్రీ ప్రారంభించినట్లు ఆస్ట్రేలియన్ మీడియా వెల్లడించింది. ఈ వార్తతో అతడి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెర్త్ వేదికగా ఆస్ట్రేలియా, వెస్టిండీస్ మధ్య జరుగుతున్న టెస్టు మ్యాచ్ మూడో రోజు ఆటకు ఛానెల్ 7 తరపున పాంటింగ్ కామెంటటేర్‌గా ఉన్నాడు. ఈ మ్యాచ్‌కు 40 నిమిషాల పాటు వ్యాఖ్యాతగా వ్యవహరించిన 47 ఏళ్ల పాంటింగ్.. ఛాతిలో నొప్పి కారణంగా కామెంట్రీ బాక్స్ నుంచి వేగంగా బయటకు వచ్చాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కోలుకోవడంతో తిరిగి కామెంట్రీ విధుల్లో చేరాడు.

సీఎస్‌కే కెప్టెన్‌గా

రుతురాజ్ గైక్వాడ్?

హైదరాబాద్: చెన్నై సూపర్ కింగ్స్ తదుపరి కెప్టెన్‌గా రుతురాజ్ గైక్వాడ్ ఎంపికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అన్ని అనుకున్నట్లు జరిగితే ఈ సీజన్‌లోనే రుతురాజ్ చెన్నై పగ్గాలు అందుకుంటాడు. ప్రస్తుత కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ కెరీర్ చివరి దశలో ఉండటంతో చెన్నై కొత్త సారథి ఎంపికపై ఫోకస్ పెట్టింది. ఐపీఎల్ 2023 సీజన్‌తో ధోనీ ఆటకు పూర్తిస్థాయిలో వీడ్కోలు పలక నున్నాడు. రెండేళ్ల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమైన ధోనీ.. కేవలం ఐపీఎల్ మాత్రమే ఆడుతున్నాడు. కరోనా కారణంగా మూడు సీజన్లు సొంతమైదానాల్లో కాకుండా బయట జరగడంతో ధోనీ రిటైర్మెంట్ నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నాడు. ఐపీఎల్ 2022 సీజన్‌లోనే వీడ్కోలు పలికేందుకు ప్రయత్నాలు చేసినా.. జట్టుకు సరైన సారథి దొరకకపోవడం.. సొంత అభిమానుల మధ్య వీడ్కోలు పలకాలనే ఆలోచనతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాడు.

జడేజా విఫలమవ్వడంతో

ఐపీఎల్ 2022 సీజన్ ఆరంభంలోనే ధోనీ సూచనలతో రవీంద్ర జడేజాకు సారథ్య బాధ్యతలు అప్పగించిన చెన్నై మేనేజ్‌మెంట్ మూల్యం చెల్లించు కుంది. సారథిగా ఏ మాత్రం అనుభవం లేని జడేజా తీవ్ర ఒత్తిడికి లోనై తడబడ్డాడు. కెప్టెన్సీ వల్ల అతని వ్యక్తిగత ప్రదర్శన కూడా దెబ్బ తిన్నది. దాంతో అతని కెప్టెన్సీ పై వేటు వేసిన చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం మళ్లీ ధోనీకే సారథ్య బాధ్యతలు అప్పగించింది. అయితే ధోనీ ఈ ఏడాదికి మించి ఆడలేని పరిస్థితి ఉండటంతో అతని వారుసుడిని ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

తదుపరి కెప్టెన్‌గా రుతురాజ్

ఐపీఎల్ 2021 సీజన్‌లో ఒంటి చేత్తో జట్టుకు టైటిల్ అందించిన రుతురాజ్ గైక్వాడ్‌ను సీఎస్‌కే తదుపరి కెప్టెన్‌గా ఎంపిక చేయాలని ఆ టీమ్ మేనేజ్ మెంట్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2021లో 635 పరుగులతో ఆరెంజ్ క్యాప్ అందుకున్న రుతు రాజ్.. ఐపీఎల్ 2022లో మాత్రం విఫలమయ్యాడు. అయితే దేశవాళీ క్రికెట్‌లో అతను నిలకడగా రాణిం చాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీతో పాటు.. శుక్రవారం ముగిసిన విజయ్ హజారే ట్రోఫీలో దుమ్మురేపాడు.

మైక్ హస్సీ సైతం

ఈ ప్రదర్శనతో సీఎస్‌కే కెప్టెన్సీకి రుతురాజ్ గైక్వాడ్ పేరును సీఎస్‌కే పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. టీమ్ సీఈవోతో పాటు కోచ్‌లు కూడా రుతురాజ్ నియమా కాన్ని సుముఖంగా ఉన్నారని, మహేంద్ర సింగ్ ధోనీ ఒక్కడు గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. అతనే సీఎస్‌కే తదుపరి కెప్టెన్ అని ఆ జట్టు వర్గాలు పేర్కొన్నాయి. సీఎస్‌కే మాజీ బ్యాటర్ మైక్ హస్సీ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. సీఎస్‌కే తదుపరి కెప్టెన్‌గా రుతురాజ్ సరిగ్గా సరిపోతాడని పేర్కొన్నాడు. ధోనీలానే ప్రశాం తంగా ఉంటూ... గేమ్‌ను బాగా అర్థం చేసుకుంటాడని, అతని దగ్గర అద్భుతమైన సారథ్య స్కిల్స్ ఉన్నాయని చెప్పాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.